# వేకువ సమయం

సంపుటి: 14 సంచిక: 225

VEKUVA SAMAYAM TELUGU DAILY

* Mahabubnagar * Hyderabad * Miryalaguda & Rangareddy | సంపాదకులు : కె.భాస్కర్‌రావు | రూ.2.00/- పేజీలు 8 | తేది: శుక్రవారం 18 సెప్టెంబర్ 2026








**సమయం ప్రతినిధి:** దేశవ్యాప్తంగా అందుతున్న విషెష్‌పై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. తన 76వ పుట్టినరోజు సందర్భంగా వెల్లువెత్తుతున్న శుభాకాంక్షలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ చేపట్టిన 'ఆశీర్వాద్ కా దియా' కార్యక్రమంపై ఆయన మాట్లాడుతూ.. ప్రజల ప్రేమాభిమానాలు తనను ఎంతగానో ఆకట్టుకున్నాయన్నారు. ప్రజల నుంచి అందుతున్న ఆశీర్వాదాలు దేశసేవ పట్ల తన సంకల్పాన్ని మరింత బలోపేతం చేస్తాయని చెప్పుకొచ్చారు. మోదీ పుట్టిన రోజును పురస్కరించుకుని గాయని స్నేహా శంకర్, కళాకారుడు అమన్ పంత్ రూపొందించిన 'ఆశీర్వాద్ కా దియా' ప్రత్యేక గీతాన్ని విడుదల చేశారు. మోదీ జన్మ దినంతో పాటు ఆయన 25 ఏళ్ల ప్రజా జీవితాన్ని గుర్తుచేస్తూ ఈ పాటను అంకితం చేశారు. దీనిపై స్పందించిన ప్రధాని.. తనకు లభిస్తున్న ప్రజల ఆశీర్వాదాలు దేశానికి సేవ చేయాలన్న తన నిబద్ధతను మరింత పెంచుతాయని పేర్కొన్నారు. కాగా.. మోదీ బర్త్‌డే సందర్భంగా నేడు దేశవ్యాప్తంగా ప్రజలు 'ఆశీర్వాద్ కా దియా(ఆశీర్వాద దీపం)' కార్యక్రమం చేపట్టాలని బీజేపీ పిలుపునిచ్చింది. సాయంత్రం 6 నుంచి 7 గంటల మధ్య ఇళ్లలో దీపాలు వెలిగించి మోదీ ఆయురారోగ్యాలు, విజయాన్ని ఆకాంక్షించాలని పార్టీ జాతీయాధ్యక్షుడు నితిన్ నబీన్ విజ్ఞప్తి చేశారు. తానూ ఆశీర్వాద దీపం వెలిగిస్తానన్న ఆయన.. ప్రజలు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజాసేవే దేశసేవ అన్న సూత్రంతో మోదీ పనిచేస్తున్నారని నితిన్ నబీన్ పేర్కొన్నారు.




**సమయం ప్రతినిధి:** టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా ఎన్. చంద్రశేఖరన్ (63) పదవీకాలాన్ని మరో ఐదేళ్ల పాటు పొడిగిస్తూ బోర్డు ఆమోదం తెలిపింది. ఇవాళ (గురువారం) ముంబైలోని బాంబే హౌస్‌లో జరిగిన టాటా సన్స్ బోర్డు సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. మునుపటి నిర్ణయం ఉపసంహరణ: ఈ ఏడాది ఆగస్టు 12న చంద్రశేఖరన్ తన ప్రస్తుత పదవీకాలం పూర్తి కాగానే మూడోసారి ఛైర్మన్‌గా కొనసాగే ఉద్దేశం లేదని ప్రకటించారు. అయితే, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) నిబంధనలు, మారిన పరిస్థితుల దృష్ట్యా నామినేషన్ అండ్ రెమ్యూనరేషన్ కమిటీ (NRC) ఆయనను మళ్లీ బాధ్యతలు స్వీకరించాల్సిందిగా కోరింది.

**నోయెల్ టాటా వ్యతిరేకత:** టాటా ట్రస్ట్స్ ఛైర్మన్, టాటా సన్స్ బోర్డు డైరెక్టర్ నోయెల్ టాటా మాత్రమే ఈ పునర్నియామక తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేశారు.

**ఐపీఓ (IPO) వివాదం:** టాటా సన్స్ కంపెనీని స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్ (IPO) చేయడాన్ని నోయెల్ టాటా మొదటి నుంచీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. మరోవైపు, టాటా సన్స్‌లో దాదాపు 18శాతం వాటా కలిగిన షాపూర్జీ పల్లోంజీ (SP) గ్రూప్ కంపెనీ లిస్టింగ్‌కు అనుకూలంగా ఉంది. 2017 నుంచి టాటా సన్స్ ఛైర్మన్‌గా సేవాలందిస్తున్న చంద్రశేఖరన్ నాయకత్వంలో గ్రూప్ మరింత విస్తరించడంతో, బోర్డు మెజారిటీ సభ్యులు ఆయన వైపే మొగ్గు చూపారు.




**సమయం ప్రతినిధి:** లోక్‌సభ 2029 ఎన్నికల ప్రధాని అభ్యర్థిత్వంపై తమిళనాట మళ్లీ రచ్చ మొదలైంది. తమిళనాడు కాంగ్రెస్ నేతలు ఈ అంశంపై పరస్పర విరుద్ధ ప్రకటనలు చేయడం, దీనిపై సోషల్ మీడియాలో కామెంట్ల వరకూ విషయం చేరడంతో మరో సారి ఈ అంశం కలకలం రేపింది. తాజాగా తమిళనాడు కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కే సెల్వపెరుంథగై ప్రధాని అభ్యర్థిత్వం మీద కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ మిత్రపక్షాలన్నీ రాహుల్ గాంధీని 2029 ప్రధాని అభ్యర్థిగా స్పష్టంగా ఆమోదించాలని ఆయన డిమాండ్ చేశారు. రాహుల్ నాయకత్వాన్ని అంగీకరించని పార్టీలతో పొత్తు కొనసాగించడంలో అర్థం లేదన్నారు. సెల్వపెరుంథగై వ్యాఖ్యలపై సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ప్రవీణ్ చక్రవర్తి తీవ్రంగా స్పందించారు. సెల్వపెరుంథగైకు కూటమి గురించి మాట్లాడే అధికారిక హోదా లేదని ఎద్దేవా చేశారు. టీవీకేతో తమ సంబంధాలు బలంగా ఉన్నాయని, ఎలాంటి గందరగోళం లేదని చెప్పారు. మొదట ఈ వివాదానికి'ఇండియా టుడే – సీఓటర్' నిర్వహించిన 'మూడ్ ఆఫ్ ది నేషన్' జాతీయ సర్వే ప్రధాన కారణమైంది. ఈ సర్వేలో 2029 ప్రధాని అభ్యర్థిగా నరేంద్ర మోదీ అగ్రస్థానంలో నిలవగా, రాహుల్ గాంధీ 27శాతం మద్దతుతో రెండో స్థానంలో నిలిచారు. ఆశ్చర్యకరంగా తమిళనాడు సీఎం విజయ్‌కు జాతీయ స్థాయిలో 9.2శాతం మద్దతు లభించి ఆయన మూడో స్థానంలో నిలిచారు. దీంతో తమిళనాడు కాంగ్రెస్ నేతలు ఈ అంశం మీద స్పందిస్తూ తమ అభిప్రాయాల్ని బయటపెడుతుండటం తమిళనాడులో అధికార కూటమి మధ్య రాజకీయ రచ్చకు కారణమౌతోంది.




**ఢిల్లీ, సెప్టెంబర్ 17, సమయం ప్రతినిధి :** ఢిల్లీలో మీడియా ప్రతినిధులతో నిర్వహించిన 'ఆఫ్ ది రికార్డ్' సమావేశంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుటుంబ ఆస్తుల పెరిగిపోవడంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేసీఆర్ కుటుంబ భూముల గురించిన వివరాలను చాలా లోతుగా సభ దృష్టికి తీసుకువచ్చారని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. 2004, 2009 ఎన్నికల అఫిడవిట్లలో కేసీఆర్‌కు భూములు లేవని పేర్కొన్నారని, కానీ 2014 నాటికి 35 ఎకరాలు, 2018లో మరింత పెరిగి, 2023 నాటికి 53 ఎకరాలు ఉన్నట్లు చూపించారని వివరించారు. 2023 నాటికి కేటీఆర్ కుటుంబ పేరిట 123 ఎకరాలు వచ్చాయని, 2026 నాటికి కేటీఆర్ 67 ఎకరాలు కొనుగోలు చేశారని తెలిపారు. సమర్పించిన అఫిడవిట్లకు, అసలు ఆస్తులకు ఎక్కడా పొంతన లేదని, తెలంగాణలో గజం భూమి లేని పేదలు ఎందరో ఉండగా కేసీఆర్ కుటుంబానికి ఇన్ని భూములు ఎక్కడి నుంచి వచ్చాయో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ కుటుంబం వద్ద ఉన్న భూములపై కచ్చితంగా సమగ్ర విచారణ జరగాల్సిందేనని స్పష్టం చేశారు. తాము వారిని బదనామ్ (ప్రతిష్ట దిగజార్చడం) చేయడానికి ఈ విషయాలు మాట్లాడటం లేదని, సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో మాట్లాడిన తర్వాత రాష్ట్రంలోని దళితులు, బీసీ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోందని అన్నారు. జన్వాడ ఫామ్‌హౌస్ తనది కాదని కేటీఆర్ అంటున్నారని, కానీ ఆయన అక్కడే ఉంటున్నట్లు తమకు సమాచారం ఉందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఆ ఫామ్‌హౌస్‌ను నిర్మించారని ఆరోపించారు. అయితే, ప్రభుత్వం ఎవరి ప్రైవేట్ ఆస్తులను లాక్కునే ఉద్దేశంతో లేదని స్పష్టం చేశారు. 22A నిషేధిత జాబితా విషయంలో ఎక్కడో ఒకచోట అధికారుల తప్పిదం ఉండి ఉండవచ్చని, దానిపై కూడా విచారణ జరుగుతోందని చెప్పారు. ఈ నిబంధనను ముఖ్యమంత్రిగానీ, మంత్రులుగానీ తమ స్వార్థం కోసం పెట్టలేదని స్పష్టం చేశారు.




**సమయం ప్రతినిధి :** సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లి, వెంకటాపూర్ పరిధిలోని భూముల వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. ఎర్రవల్లి ఫామ్‌హౌస్ భూములపై రెవెన్యూ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా నేడు(గురువారం) మర్కుక్ తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు ముమ్మరంగా దస్త్రాల తనిఖీలు చేపట్టారు. ఇందుకోసం జిల్లా కలెక్టరేట్ నుంచి ఏడీ సుదర్శన్, ఆర్డీఓ చంద్రకళ తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఎర్రవల్లి, వెంకటాపూర్ గ్రామాలకు సంబంధించిన సర్వే నంబర్లను ఆరా తీసి.. అక్కడి ప్రభుత్వ, పట్టా భూముల పూర్తి వివరాలను సేకరిస్తున్నారు. ముఖ్యంగా సుమారు 385 ఎకరాల ప్రభుత్వ భూమికి సంబంధించిన అంశంపై అధికారులు తీవ్రంగా ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. కాగా.. ఈ విచారణలో ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నారు అధికారులు. గూగుల్ ఎర్త్ మ్యాప్ సాయంతో పాత శాటిలైట్ చిత్రాలను పరిశీలిస్తూ.. గతంలో ఆ భూముల పరిస్థితి ఎలా ఉండేదో తెలుసుకుంటున్నారు. నాటికి, నేటికి ఏవైనా మార్పులు జరిగాయా అనే కోణంలో లోతుగా విశ్లేషిస్తున్నారు. అధికారుల విచారణ పూర్తవగానే ఈ భూములకు సంబంధించి మరిన్ని నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది.

## దివ్యాంగులకు అండగా కేంద్ర ప్రభుత్వం

## 149 మంది దివ్యాంగులకు 284 ఉపకరణాల పంపిణీ



సమయం ప్రతినిధి, షాద్‌నగర్, సెప్టెంబర్ 17: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా షాద్‌నగర్ ఇండోర్ స్టేడియంలో కేంద్ర ప్రభుత్వ సంస్థ అలింకో ఆధ్వర్యంలో దివ్యాంగులకు సహాయక ఉపకరణాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. రూ.21.21 లక్షల నిధులతో 149 మంది దివ్యాంగులకు 284 ఉపకరణాలను ఎంపీ డీకే అరుణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం రోజున దివ్యాంగులకు ఉపకరణాలు అందించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. బ్యాటరీ వాహనాలు, ట్రైసైకిళ్లు, వినికిడి పరికరాలు, చేతికర్రలు తదితర సహాయక ఉపకరణాలను లబ్ధిదారులకు అందించినట్లు తెలిపారు. నిరుపేద కుటుంబంలో జన్మించిన నరేంద్ర మోదీ పట్టుదలతో ముఖ్యమంత్రి స్థాయి నుంచి దేశ ప్రధానమంత్రి స్థాయికి ఎదిగారని డీకే అరుణ పేర్కొన్నారు. దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రధాని కృషి చేస్తున్నారని అన్నారు. రైతులు, మహిళలు, యువత అన్ని రంగాల్లో రాణించేలా కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. 'వికసిత్ భారత్-2047' లక్ష్యంగా దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే దిశగా ప్రధాని మోదీ పరిపాలన సాగిస్తున్నారని పేర్కొన్నారు. మహిళా సాధికారత కోసం కేంద్ర ప్రభుత్వం రుణాలు, ఇతర అవకాశాలను కల్పిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ప్రజలు అభివృద్ధి చెందాలని సూచించారు. ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా దేశవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురువారం సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల మధ్య ప్రతి ఇంటా 'ఆశీస్సుల దీపం' వెలిగించి ప్రధాని మోదీకి ఆశీస్సులు అందించాలని పిలుపునిచ్చారు. అనంతరం దివ్యాంగులతో కలిసి ఎంపీ డీకే అరుణ కేక్ కట్ చేశారు. 'ఆశీస్సుల దీపం' వెలిగించారు. పోషణ్ అభియాన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అలాగే బీజేపీ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎంపీ సందర్శించి రక్తదాతలకు ధ్రువపత్రాలను అందజేశారు. సెప్టెంబర్ 17 హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైన చారిత్రక రోజని డీకే అరుణ అన్నారు. నిజాం పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు, హింసకు గురైన సమయంలో అప్పటి కేంద్ర హోంశాఖ మంత్రి సర్దార్ వల్లభభాయ్ పటేల్ చర్యలతో హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైందని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా విమోచన దినోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారులు, తహసీల్దార్, బీజేపీ నాయకులు అందే బాబయ్య, విష్ణువర్ధన్ రెడ్డి, పార్టీ ముఖ్య నాయకులు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విశ్వకర్మ నైపుణ్యాలను ఆధునిక సాంకేతికతతో అనుసంధానం చేయాలి జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా



**సమయం ప్రతినిధి, మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 17:** విశ్వకర్మ చేతివృత్తులు, కళలు, శిల్పకళ, వాస్తుకళ, నైపుణ్యాలకు ఆద్యుడని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అన్నారు. విశ్వకర్మ జయంతిని పురస్కరించుకొని గురువారం జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ బంగ్లా సమీపంలోని విశ్వకర్మ దేవాలయంలో నిర్వహించిన భగవాన్ శ్రీ విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తరతరాలుగా తమ వృత్తి నైపుణ్యాలను కొనసాగిస్తూ సమాజానికి సేవలందిస్తున్న చేతివృత్తిదారులను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సంప్రదాయ చేతివృత్తులు, కళలు, శిల్పకళను పరిరక్షించడంతో పాటు వాటికి తగిన ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందన్నారు. చేతివృత్తిదారుల సంక్షేమం, వారి వృత్తుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో నగర మేయర్ జి.మమత, జిల్లా బీసీ సంక్షేమ అభివృద్ధి శాఖ అధికారి విష్ణునందన్ తదితరులు పాల్గొన్నారు.

వేకువ సమయం
శుక్రవారం 18 సెప్టెంబర్ 2026

# సంపాదకీయం

## నీలి విప్లవంలో నవభారత శకం

'సబ్‌కా సాథ్.. 'సబ్‌కా వికాస్.. 'సబ్‌కా విశ్వాస్.. 'సబ్‌కా ప్రయాస్' అనేది ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వ తారకమంత్రం. భారతదేశ అభివృద్ధి ప్రస్థానాన్ని అది సదా సార్వజనీనంగా, సర్వతోముఖంగా నిలుపుతోంది. గడచిన పాతికేళ్లలో కోట్లాది ప్రజల, ప్రత్యేకించి పేద--అణగారిన వర్గాలవారి జీవితాలను మోదీ తన విశిష్ట పాలనా దక్షతతో అమితంగా ప్రభావితం చేశారు. ఆర్థిక ప్రగతిపై ఆయన విధానం అందరికీ ఆదర్శప్రాయం. వెనుకబడిన జిల్లాలను 'ఆకాంక్షాత్మక జిల్లాలు'గా, సరిహద్దు గ్రామాలను 'సమర్థ--ప్రథమ గ్రామాలు'గా, ఈశాన్య ప్రాంతాన్ని 'అష్టలక్ష్మి'గా అభివర్ణించడం ఆయన పరిణామాత్మక దృక్పథానికి ప్రతీక. ఈ విధానం భౌగోళిక వివక్షను సాధికారతగా రూపుదిద్ది, వికసిత భారత్ దిశగా ప్రస్థానంలో వివిధ వర్గాల క్రియాశీల భాగస్వామ్యానికి బాటలు వేసింది. 'పీఎం జన్మాన్, పీఎం జన్-ధన్, పీఎం- గరీబ్ కల్యాణ్ యోజన' వంటి పథకాలే ఈ విజయానికి నిదర్శనం. వీటితో పాటు ఇతరత్రా అమలుపరుస్తోన్న కార్యక్రమాలు కూడా సార్వజనీన ప్రగతి, సామాజిక సాధికారతపై ప్రధానమంత్రి నిబద్ధతను చాటిచెబుతున్నాయి. కనుకనే దేశవ్యాప్తంగా 25 కోట్ల మంది పేదరికం నుంచి విముక్తి పొందారు. ఈ అపూర్వ పురోగతి మన జాతి జీవనంలోనే కాకుండా సమస్త మానవాళి చరిత్రలో కూడా ఒక చిరస్మరణీయ మలుపు. ప్రపంచవ్యాప్తంగా పేదరికం, ఆకలి దప్పుల నుంచి నిరుపేదలు శాశ్వతంగా బయటపడే రోజు త్వరలోనే తప్పక వస్తుందనడానికి ఈ భారత విజయం ఒక శుభ సంకేతం. ఈ సార్వజనీన వృద్ధికి మరింత భరోసా, సుస్థిరత కల్పించేందుకు ప్రధాని మోదీ 'నీలి ఆర్థిక వ్యవస్థ'పై దృష్టి సారించారు. హరిత విప్లవం 1960ల్లో దేశ ప్రజల క్షుద్బాధను తీర్చింది. తదాదిగా ప్రపంచ ఆహార భద్రతలో భారత్ పాత్ర మరింత పటిష్ఠమవుతోంది. బియ్యం, గోధుమలు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాల ఉత్పత్తిలో భారత్ నేడు ప్రపంచ అగ్ర దేశాలలో ఒకటిగా నిలిచింది. హరిత విప్లవం శ్వేత విప్లవంతో దేశంలో పాల కొరత తీరిపోయింది. పాడి ఉత్పత్తులపై మన పరాధీనత తొలగిపోయింది. భారత్ ఇప్పుడు పాడి ఉత్పత్తులలో ప్రపంచ అగ్రగామిగా వెలుగొందుతోంది. ఈ ఆహారోత్పత్తి విజయాలతో ప్రజల్లో, ముఖ్యంగా బాలల్లో పోషకాహార లోపం గణనీయంగా తగ్గింది. మన విజయగాథలో ఇవాళ నీలి విప్లవం మరో ఉజ్వల అధ్యాయంగా నిలుస్తోంది. ప్రకృతి మాత కరుణతో మన దేశానికి 11,000 కిలోమీటర్లకు పైగా తీరప్రాంతం సమకూరింది. ప్రాచీన కాలం నుంచీ సముద్రయానం, విదేశీ వాణిజ్యంలో మనకొక సుసంపన్న సంప్రదాయం కూడా ఉంది. అలాగే, మనకు మన భూభాగాల పరివేష్ఠిత సముద్రాలలో దాదాపు 24 లక్షల చదరపు కిలోమీటర్ల వైశాల్యంతో ప్రత్యేక ఆర్థిక మండలం (ఈఈజడ్) కూడా ఉంది. సముద్ర సంపదపరంగానూ ప్రపంచంలో భారత్ కీలక స్థానంలో నిలుస్తోంది. ప్రధాని మోదీ ప్రభుత్వం 2019లో మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమల మంత్రిత్వశాఖను ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది. ఆ విధంగా మత్స్య రంగం తొలిసారి ఒక మంత్రిత్వశాఖ పరిధిలోకి వచ్చింది. ఈ నేపథ్యంలో "మన జాతీయ పతాకంలోని నీలి చక్రం 'నీలి విప్లవం'- అంటే సముద్ర ఆర్థిక వ్యవస్థ సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తోంది" అని నరేంద్ర మోదీ అభివర్ణించారు. భారత మత్స్య- జల సాగు రంగం (ఆక్వా కల్చర్/ ఫిషరీస్ సెక్టార్) గడచిన దశాబ్ద కాలంలో మన ఆర్థిక వ్యవస్థలో ఒక వాస్తవిక ఉషోదయ రంగంగా ఆవిర్భవించింది. అంతర్జాతీయంగా చేపల ఉత్పత్తిలో సుమారు 8 శాతం వాటాతో మన దేశం నేడు రెండో స్థానంలో ఉంది. ఇంచుమించు 3 కోట్ల మంది జాలర్లు, చేపల పెంపకందారుల జీవనోపాధికి ఇప్పుడిది ఒక పెద్ద ఆసరాగా ఉంది. అంతేకాకుండా దేశంలో ఆహార భద్రతకూ ఈ రంగం గణనీయంగా దోహదం చేస్తోంది. 2024-25లో మన చేపల ఉత్పత్తి సామర్థ్యం 195 లక్షల టన్నుల స్థాయిని మించిపోయింది. ఈ భారీ ఉత్పత్తి మత్స్య రంగం అద్భుత పురోగమనాన్ని స్పష్టం చేస్తోంది.మత్స్య, -పశుసంవర్ధక, -పాడిపరిశ్రమల మంత్రిత్వ శాఖ ఇటీవల ఒడిషాలో, లక్షదీవులలో నిర్వహించిన వివిధ కార్యక్రమాలకు నేను హాజరయ్యాను. వీటిలో మొదటిది-సముద్రపు లోతుల్లోని మత్స్య సంపద సుస్థిర వినియోగాన్ని ప్రోత్సహించేందుకు, భారత పతాకం గల నౌకలకు అధికార పత్రాల ప్రదానానికి ఉద్దేశించిన జాతీయ కార్యక్రమం. రెండోది-మత్స్య రంగంపై అవగాహన కల్పించేందుకు నిర్వహించిన కార్యక్రమం. కేంద్ర మత్స్య, -పశుసంవర్ధక, -పాడిపరిశ్రమల మంత్రిత్వ శాఖ ఈ కార్యక్రమాలను నిర్వహించడం నాకెంతో సంతోషాన్నిచ్చింది. సముద్ర మత్స్య పరిశ్రమలో వృద్ధి, సుస్థిరత, సౌభాగ్య సహిత నవశకం వైపు పయనించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, వివిధ సంస్థలు, మన మత్స్యకార సంఘాల సమష్టి సంకల్పాన్ని ఆ కార్యక్రమాలు ప్రతిబింబించాయి. బాధ్యతాయుత చేపల వేట పద్ధతులు మన దేశ భవిష్యత్తుకు కచ్చితంగా విలువైన మూలధనమేనని నేను ప్రగాఢంగా విశ్వసిస్తాను. నేను ఉపరాష్ట్రపతిగా గత నెలలో లక్ష దీవులలో తొలిసారి పర్యటించాను. ఆ సందర్భంగా ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద అక్కడ అనేక అభివృద్ధి ప్రాజెక్టులకు ఆమోదం లభించిందని తెలిసి చాలా ఆనందించాను.గత ఆర్థిక సంవత్సర కేంద్ర బడ్జెట్ కూడా మన 'ఈఈజడ్' పరిధిలోని జలాల్లో నిబిడీకృత సామర్థ్యం సద్వినియోగం కాకపోవడాన్ని గుర్తించింది. దీని పరిధితోపాటు అంతర్జాతీయ జలాల్లోని మత్స్య సంపద సుస్థిర వినియోగం దిశగా ఒక ప్రగతిశీల విధాన చట్రాన్ని ప్రకటించింది. ఈ కొత్త సరిహద్దుల్లో మన మత్స్యకారులు ధైర్యంగా వేటాడేందుకు ఈ కొత్త విధాన చట్రం తోడ్పడుతుంది.మన మత్స్యకారులకు ఈ కొత్త చట్రం ఎనలేని ప్రాధాన్యమివ్వడం నాకెంతో ఆనందదాయకంగా ఉంది. 'ఈఈజడ్'లో మత్స్య రంగంపై రూపొందించిన నిబంధనలు, అంతర్జాతీయ జలాల్లో వేటకు సంబంధించిన 2025 నాటి మార్గదర్శకాలు మన మాతృభూమి భారత్‌కు ఓ శుభారంభాన్ని సూచిస్తున్నాయి. ఈ మేరకు మత్స్యకారుల సహకార సంఘాలు, చేపల పెంపకందారులు, ఉత్పత్తిదారు సంస్థలు, భారతీయ మత్స్యకారులకు అధికార పత్రాల జారీలో దీనికింద ప్రాధాన్యం ఉంటుంది. అలాగే, సుమారు 32 చదరపు కిలోమీటర్ల భూభాగం గల లక్షద్వీప్‌కు దాదాపు 145 కిలోమీటర్ల తీరరేఖ, సుమారు 4,200 చదరపు కిలోమీటర్ల మడుగు ప్రాంతం ఉన్నాయి. అంతేగాక 20,000 చదరపు కిలోమీటర్లకు పైగా విస్తరిత ప్రాదేశిక జలాలు, సుమారు 4 లక్షల చదరపు కిలోమీటర్ల ప్రత్యేక ఆర్థిక మండలం కూడా ఉన్నాయి. అంటే- భారత 'ఈఈజడ్'లో దాదాపు ఆరో వంతు లక్షదీవులలోనే ఉంది. ఇదే మన నిజమైన సాగర సామర్థ్యం. ఇప్పుడు ఇదొక శక్తిమంతమైన సందేశాన్నిస్తోంది: వ్యష్టిగా పనిచేస్తే వ్యక్తి ముందడుగు వేస్తాడు, అయితే అందరూ ఒక్కటై సమష్టిగా కృషి చేస్తే ఒక పరిణామాత్మక మార్పును తేగలరు.భారత సముద్ర ఆహారం నేడు 120కి పైగా దేశాలకు ఎగుమతి అవుతోంది. ఈ నేపథ్యంలో గత ఆర్థిక సంవత్సరంలోనే మత్స్యరంగం ఎగుమతులు రూ.73,000 కోట్ల మేర అద్భుత స్థాయికి చేరాయి. దీన్ని 2013-14 నాటి గణాంకాలతో పోలిస్తే 140 శాతానికి పైగా పెరుగుదలను సూచిస్తుంది.ప్రపంచ అగ్రగామి మార్కెట్లలో భారత సముద్రపు ఆహారానికి మరింత ఆదరణను సముపార్జించడంలో డిజిటల్ ప్రామాణీకరణ వ్యవస్థలు, నౌకల పర్యవేక్షణ, అంతర్జాతీయ ధ్రువీకరణ, ఇతర చర్యలు ఎంతగానో తోడ్పడతాయి. ప్రగతి పథంలో పయనించేటప్పుడు మనం ప్రకృతి పట్ల మన బాధ్యతను ఎన్నడూ మరువరాదు. సముద్రం వేల ఏళ్లుగా మానవాళిని పోషిస్తోంది. దాన్ని మరిన్ని వేల ఏళ్లపాటు పరిరక్షించడం మన పవిత్ర కర్తవ్యం.

## ఎస్సీ, ఎస్టీల సమస్యలను సత్వరం పరిష్కరించాలి

### సబ్‌ప్లాన్ నిధులను ఇతర అవసరాలకు మళ్లించొద్దు : కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



సమయం ప్రతినిధి, మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 17: ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సూచించారు. సబ్‌ప్లాన్ నిధులను ఆయా వర్గాల సంక్షేమం, అభివృద్ధికే వినియోగించాలని, ఇతర అవసరాలకు మళ్లించరాదని స్పష్టం చేశారు. మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో గురువారం కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మీనారాయణలతో కలిసి జిల్లా అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. భూ సమస్యలు, అట్రాసిటీ కేసులు, సంక్షేమ పథకాలు, ఉద్యోగ నియామకాలు, పదోన్నతుల్లో రిజర్వేషన్లు, రోస్టర్ విధానంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ శాఖల్లో రోస్టర్ రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించి రిజర్వేషన్ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. బ్యాక్‌లాగ్ ఖాళీలను గుర్తించి నియామకాలు చేపట్టాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ ప్రాంతాల్లో అంగన్‌వాడీ భవనాలు, తాగునీరు, విద్యుత్ తదితర మౌలిక వసతులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సివిల్ రైట్స్ డే సమావేశాలకు తహసీల్దార్లు, సంబంధిత పోలీసు అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్, ఎస్పీలను కోరారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించి, వారి సమస్యలను చట్ట ప్రకారం పరిష్కరించాలని సూచించారు. భూమి కొనుగోలు పథకం కింద భూములు పొందిన పేద ఎస్సీ కుటుంబాలకు బోర్లు, పంపుసెట్లు, విద్యుత్ కనెక్షన్లు కల్పించేందుకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. పెండింగ్ సంక్షేమ పథకాల వివరాలను సమర్పించాలని, సెప్టెంబర్ 22న జరిగే రాష్ట్రస్థాయి సమావేశంలో జిల్లాకు సంబంధించిన సమస్యలను ప్రస్తావిస్తామని తెలిపారు. సమావేశంలో కలెక్టర్ ఖుష్బూ గుప్తా, ఎస్పీ డి.జానకి, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎస్సీ, ఎస్టీ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత: ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ:చింతపల్లి: సెప్టెంబర్ 17 (సమయం ప్రతినిధి) : చింతపల్లి మండలం పోలేపల్లి--రాంనగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని వనమైసమ్మ గుడి వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే బాలునాయక్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యతపై ఆయన మాట్లాడారు. మొక్కలు నాటడం ద్వారా పచ్చదనం పెరగడంతో పాటు వాతావరణ సమతుల్యత కాపాడబడుతుందని ఎమ్మెల్యే తెలిపారు. చెట్లు గాలిలోని కాలుష్యాన్ని తగ్గించి, ప్రజలకు స్వచ్ఛమైన గాలిని అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. కేవలం మొక్కలు నాటడంతో కార్యక్రమం పూర్తికాదని, నాటిన ప్రతి మొక్కను బాధ్యతగా సంరక్షించి, అవి పెద్ద చెట్లుగా ఎదిగేలా చూడాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రతి గ్రామంలో విస్తృతంగా మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని, ప్రజలు, యువత, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు సమిష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే బాలునాయక్ పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణను సామాజిక బాధ్యతగా భావించి ప్రతి ఒక్కరూ మొక్కల సంరక్షణలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాటావత్ హరినాయక్, దొంతమోని యాదమ్మ, మాస భాస్కర్, దొంతినేని వెంకటేశ్వరరావు, సిద్దగోని కృష్ణ గౌడ్, మునుకుంట్ల శేఖర్, కొడిదొడ్డి శంకర్, కొప్పుల జంగయ్య, నేనావత్ జవహర్ లాల్, నేనావత్ వసంత్ నాయక్, ఉప్పు శ్రీశైలం, కేతావత్ శ్రీను, మునుకుంట్ల శేఖర్ గౌడ్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సింగపూర్ స్టడీ టూర్‌కు దేవరకద్ర ఎంఈఓ పి.బలరాం



సమయం ప్రతినిధి : మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండల విద్యాధికారి (ఎంఈఓ) పి.బలరాం సింగపూర్ స్టడీ టూర్‌కు ఎంపికయ్యారు. అంతర్జాతీయ స్థాయిలో అమలవుతున్న ఉత్తమ బోధనా విధానాలను అధ్యయనం చేసేందుకు తెలంగాణ విద్యాశాఖ చేపట్టిన అంతర్జాతీయ అధ్యయన పర్యటనలో భాగంగా ఆయనకు ఈ అవకాశం లభించింది.రెండో విడతలో రాష్ట్రం నుంచి 10 మంది అధికారులను సింగపూర్ అధ్యయన పర్యటనకు ఎంపిక చేయగా, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి, దేవరకద్ర ఎంఈఓ పి.బలరాం ఎంపికయ్యారు. ఈ నెల 19 నుంచి 26వ తేదీ వరకు సింగపూర్‌లో జరిగే అధ్యయన పర్యటనలో పి.బలరాం పాల్గొని అక్కడి విద్యా విధానాలు, బోధనా పద్ధతులు, పాఠశాలల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించనున్నారు.ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి ఎంఈఓ స్థాయి అధికారి సింగపూర్ స్టడీ టూర్‌కు ఎంపిక కావడం పట్ల విద్యాశాఖ వర్గాలు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**దేవరకద్ర నుంచి ఇద్దరు ఉపాధ్యాయులకు అవకాశం**

ఇదిలా ఉండగా రాష్ట్రవ్యాప్తంగా 29 మంది ఉపాధ్యాయులను సింగపూర్ స్టడీ టూర్‌కు ఎంపిక చేయగా, దేవరకద్ర మండలం నుంచి ఇద్దరు ఉపాధ్యాయులకు అవకాశం లభించింది. నార్లోనికుంట ప్రాథమిక పాఠశాలకు చెందిన ఎస్‌జీటీ ఉపాధ్యాయుడు నోమేశ్వర్ రెడ్డి, దేవరకద్ర ఉర్దూ మాధ్యమ పాఠశాలకు చెందిన స్కూల్ అసిస్టెంట్ (బయోసైన్స్) నఫీస్ ఉన్నీసా బేగం ఎంపికయ్యారు. మహబూబ్‌నగర్ జిల్లా నుంచి డీఈఓ విజయకుమారి, ఎంఈఓ పి.బలరాం, ఉపాధ్యాయులు నోమేశ్వర్ రెడ్డి, నఫీస్ ఉన్నీసా బేగం ఈ నెల 19న సింగపూర్ స్టడీ టూర్‌కు బయలుదేరనున్నారు. 26వ తేదీ వరకు సింగపూర్‌లో పర్యటించి అక్కడి ఉత్తమ విద్యా విధానాలపై అధ్యయనం చేయనున్నారు.

## కోయిల్ సాగర్ ఆయకట్టుకు సాగునీటి విడుదలకు మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాలు రైతుల విజ్ఞప్తి కి మంత్రి తక్షణ స్పందన



హైదరాబాద్ : కోయిల్ సాగర్ రిజర్వాయర్ కింద ఉన్న సుమారు 10 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు విడుదల చేయాలని రైతులు మంత్రి వాకిటి శ్రీహరిని కోరారు. రైతుల విజ్ఞప్తిపై మంత్రి వెంటనే స్పందించి సంబంధిత అధికారులను పిలిపించి సాగునీటి విడుదలకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి పంటలు నష్టపోయే పరిస్థితి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులకు సూచించారు. ఎల్ నినో ప్రభావం పై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం రైతులు పంటలు సాగు చేసుకునేందుకు అవసరమైన నీటిని అందుబాటులో ఉంచేలా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించి సాగుకు ఇబ్బందులు లేకుండా చూడాలని మంత్రి స్పష్టం చేశారు.

## మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించిన ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్

మహబూబాబాద్ జిల్లా (సెప్టెంబర్ 17 వేకువ సమయం):తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని మహబూబాబాద్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో గురువారం జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బందికి, జిల్లా ప్రజలకు ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ హైదరాబాద్ సంస్థానం నిజాం పాలనలోనే కొనసాగిందని తెలిపారు. కేంద్ర హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ నేతృత్వంలో చేపట్టిన ఆపరేషన్ పోలో అనంతరం 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనం అయిన చారిత్రక ఘట్టాన్ని గుర్తు చేశారు.

ప్రజా సంక్షేమమే ప్రజాపాలన లక్ష్యం

ప్రజాస్వామ్య పాలనలో ప్రజల సంక్షేమం, పారదర్శకత, జవాబుదారీతనం ఎంతో కీలకమని ఎస్పీ పేర్కొన్నారు. ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా అందేలా ప్రజాపాలన వ్యవస్థ పనిచేస్తుందని తెలిపారు.

ప్రజల భద్రతకు పోలీసుల కృషి

శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల రక్షణ పోలీసుల ప్రధాన బాధ్యత అని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రజలకు మరింత చేరువగా ఉంటూ వారి సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించేందుకు ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## భారత్‌ను ప్రధాని మోదీ గ్లోబల్ పవర్‌గా మార్చారు.. ఇజ్రాయెల్ ప్రధాని కితాబు

మొదటి పేజీ తరువాయి

భారత ప్రధాని నరేంద్ర మోదీ 76వ పుట్టినరోజు (సెప్టెంబర్ 17) సందర్భంగా ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మోదీకి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. సామాజిక మాధ్యమం X ద్వారా ఇరు దేశాల నాయకుల ఫొటోను పంచుకుంటూ నెతన్యాహు కీలక వ్యాఖ్యలు చేశారు. 'గ్లోబల్ పవర్'గా భారతదేశం: ప్రధాని మోదీ బలమైన నాయకత్వంలో భారతదేశం 'వరల్డ్ పవర్'గా రూపాంతరం చెందిందని నెతన్యాహు కొనియాడారు. భారత్-ఇజ్రాయెల్ రెండు అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాల మధ్య ఇదివరకూ ఎన్నడూ లేని విధంగా బలమైన, అపూర్వమైన భాగస్వామ్యం ఏర్పడిందని చెప్పారు. ఇరు దేశాల మధ్య మైత్రి గతంలో కంటే ఇప్పుడు చాలా బలంగా ఉందని, భవిష్యత్తులో ఈ భాగస్వామ్యాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీకి ఆరోగ్యవంతమైన, సుదీర్ఘమైన నాయకత్వ జీవితం లభించాలని ఇజ్రాయెల్ ప్రధాని ఆకాంక్షించారు.ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో పాటు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇటలీ ప్రధాని జార్జియా మెలోని సహా ప్రపంచవ్యాప్తంగా పలువురు అగ్రనేతలు ప్రధాని మోదీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవం



జడ్చర్ల సెప్టెంబర్ 17, సమయం ప్రతినిధి: జడ్చర్ల మున్సిపల్ కార్యాలయంలో తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ఎం.గిరీష్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ విమోచన పోరాటంలో ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. పట్టణ అభివృద్ధికి మున్సిపల్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, మేనేజర్లు, ఇంజినీరింగ్ సిబ్బంది, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.





## నిజాం పాలన నుంచి ప్రజాస్వామ్య వ్యవస్థకు పరివర్తన చెందిన చారిత్రక రోజు

# మహబూబ్‌నగర్‌లో ఘనంగా తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం

**సమయం ప్రతినిధి, మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 17:** నిజాం రాచరిక పాలన నుంచి తెలంగాణ ప్రజలు ప్రజాస్వామ్య పాలనా వ్యవస్థలోకి అడుగుపెట్టిన చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకొని గురువారం మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టరేట్ ఆవరణలో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా పాలనలో పారదర్శకత, సమాజంలోని అన్ని వర్గాలకు స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగిస్తూ సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యం ఇస్తోందన్నారు.

**ఆరు గ్యారంటీల అమలుకు కట్టుబడి ఉన్నాం**

ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు ఆరు గ్యారంటీలను దశలవారీగా అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. మహాలక్ష్మి పథకం కింద జిల్లాలో ఇప్పటి వరకు దాదాపు 3.81 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకున్నారని, రూ.185.60 కోట్ల మేర ప్రయోజనం చేకూరిందన్నారు.

రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకం కింద 1,27,056 మంది వినియోగదారులకు 4.13 లక్షల సిలిండర్లు అందించగా, ప్రభుత్వం రూ.11.35 కోట్ల సబ్సిడీ అందించిందన్నారు. గృహజ్యోతి పథకం కింద 1,37,046 జీరో బిల్లులు జారీ చేసి, రూ.107.77 కోట్ల సబ్సిడీ అందించినట్లు తెలిపారు.

**ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇళ్లకు ప్రాధాన్యం**

ఆరోగ్యశ్రీ పథకం కింద వైద్య చికిత్స పరిమితిని రూ.10 లక్షలకు పెంచామని, జిల్లాలో 50,314 మంది లబ్ధిదారులు శస్త్రచికిత్సల ద్వారా ప్రయోజనం పొందగా రూ.145.79 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. నిరుపేదలకు సొంతింటి కల సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. జిల్లాలో 10,232 ఇళ్లకు రూ.511.60 కోట్ల అంచనా వ్యయంతో మంజూరు చేయగా, 9,208 ఇళ్ల పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. రెండో విడతలో ప్రతి నియోజకవర్గానికి మరో 1,500 ఇళ్లతో పాటు 500 ఇళ్లకు పైకప్పు మార్పునకు నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు.

**రైతు సంక్షేమానికి పెద్దపీట**

రైతుభరోసా కింద జిల్లాలో 2,12,153 మంది రైతులకు రూ.818.22 కోట్లు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు మంత్రి తెలిపారు. 2024 పంట రుణమాఫీలో భాగంగా 76,385 మంది రైతులకు రూ.597.05 కోట్ల రుణమాఫీ చేశామన్నారు. రైతుబీమా కింద ప్రమాదవశాత్తు మరణించిన 1,855 మంది రైతుల నామినీలకు రూ.92.75 కోట్లు అందించినట్లు తెలిపారు.

**విద్య, మహిళా సాధికారతకు ప్రాధాన్యం**

జిల్లాలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణానికి చర్యలు చేపట్టామని, అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో 642 పాఠశాలల్లో పనులు ప్రారంభించి 585 పాఠశాలల్లో పూర్తి చేసినట్లు తెలిపారు. 76 పాఠశాలల్లో కృత్రిమ మేధస్సు ఆధారిత ప్రయోగశాలలు ప్రారంభించినట్లు చెప్పారు. జిల్లాలో 12,069 స్వయం సహాయక సంఘాల్లో 1,22,180 మంది మహిళలు ఉన్నారని, మహిళల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు.

**భూ భారతి ద్వారా పారదర్శక సేవలు**

ధరణి స్థానంలో అమలు చేస్తున్న భూ భారతి చట్టం ద్వారా భూ రిజిస్ట్రేషన్లు, మ్యూటేషన్లు, ఆస్తుల బదిలీల్లో పారదర్శకత, జవాబుదారీతనం, వేగవంతమైన సేవలు అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. రెవెన్యూ సదస్సుల ద్వారా 6,545 అర్జీలు, సాదాబైనామా దరఖాస్తుల్లో 3,840 పరిష్కరించినట్లు చెప్పారు.

**మౌలిక వసతుల అభివృద్ధి :** మహబూబ్‌నగర్ నగరంలో నీటి సరఫరా మెరుగుదలకు రూ.220.94 కోట్లు, భూగర్భ డ్రైనేజీ పథకానికి రూ.603 కోట్లు మంజూరై పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని తెలిపారు. కోయిల్‌సాగర్, మహాత్మాగాంధీ లిఫ్ట్ ఇరిగేషన్, పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల కోసం 11,150 ఎకరాల భూసేకరణ పూర్తయిందన్నారు. మిషన్ భగీరథ ద్వారా జిల్లాలో 1,50,056 గృహాలకు నల్లా కనెక్షన్ల ద్వారా సురక్షిత తాగునీరు అందిస్తున్నట్లు తెలిపారు.

**పర్యాటక, క్రీడా రంగాలకు ప్రోత్సాహం**

పిల్లలమర్రిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. కోయిల్‌సాగర్, రామకొండ, కోయిలకొండ ప్రాంతాలను కూడా పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు కొనసాగుతున్నాయని, మహబూబ్‌నగర్‌లో సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ నిర్మాణానికి రూ.10.70 కోట్లు, నాలుగు బహిరంగ వ్యాయామశాలల ఏర్పాటుకు రూ.1 కోటి మంజూరైనట్లు తెలిపారు. జిల్లా అభివృద్ధిలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పోలీసులు, వైద్యులు, పారిశుద్ధ్య కార్మికులు, మీడియా ప్రతినిధులు అందరూ భాగస్వాములు కావాలని మంత్రి జూపల్లి కృష్ణారావు కోరారు.

**అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు**

ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా విద్యార్థులు ప్రదర్శించిన కళారూపాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, జిల్లా ఎస్పీ డి.జానకి, నగర మేయర్ జి.మమత, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబెదుల్లా కొత్వాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి.హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ సాయి శివాని తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ఇక సభ్యత్వం ఫ్రీ.. ఆపదలో అండగా సంక్షేమ సంఘం



సమయం ప్రతినిధి, మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 17:జర్నలిస్టులకు ఆపద సమయంలో అండగా నిలవాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన పాలమూరు జర్నలిస్టుల సంక్షేమ సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై జర్నలిస్టుల నుంచి ఎలాంటి సభ్యత్వ రుసుము వసూలు చేయకుండా ఉచితంగా సభ్యత్వాలు అందించాలని నిర్ణయించింది. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంఘం అధ్యక్షుడు వాకిట అశోక్‌కుమార్, కార్యదర్శి మల్లు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు సంఘం తీసుకున్న నిర్ణయాలను వెల్లడించారు. సంఘం అత్యవసర సమావేశంలో జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించి పలు తీర్మానాలు చేసినట్లు చెప్పారు.

**రూ.వెయ్యి సభ్యత్వ రుసుముకు స్వస్తి**

పాలమూరు జర్నలిస్టుల సంక్షేమ సంఘం ఏర్పాటైన సమయంలో సభ్యత్వ రుసుమును రూ.1,000గా నిర్ణయించినట్లు తెలిపారు. అయితే పలువురు జర్నలిస్టులు తమ ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సభ్యత్వ రుసుమును తగ్గించాలని లేదా ఉచితంగా సభ్యత్వం కల్పించాలని కోరినట్లు చెప్పారు. ఈ వినతులను పరిగణనలోకి తీసుకుని, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సూచన మేరకు ఇకపై ఉచితంగానే సభ్యత్వాలు ఇవ్వాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఇప్పటికే రూ.1,000 చెల్లించి సభ్యత్వం తీసుకున్న జర్నలిస్టులకు ఆ మొత్తాన్ని తిరిగి చెల్లిస్తామని స్పష్టం చేశారు.

**సోమవారం నుంచి సభ్యత్వ నమోదు**

వచ్చే సోమవారం నుంచి పది రోజుల పాటు సురవరం ప్రతాపరెడ్డి ప్రెస్ భవన్ (మహబూబ్‌నగర్ ప్రెస్ క్లబ్)లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని జర్నలిస్టులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని సంఘంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

**ఆపదలో ఉన్న జర్నలిస్టులకు అండ :** జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న సంఘం ఇటీవల అనారోగ్యానికి గురైన జర్నలిస్టు ఆరగిద్ద అనిల్ సతీమణికి, సబ్‌ఎడిటర్ ప్రదీప్‌కు ఆర్థిక సాయం అందించాలని కూడా తీర్మానించినట్లు తెలిపారు. సభ్యత్వం పూర్తిగా ఉచితంగా అందిస్తున్న నేపథ్యంలో ప్రతి జర్నలిస్టు సంఘంలో సభ్యత్వం నమోదు చేసుకోవాలని సూచించారు. ఇకపై సభ్యత్వం నమోదు చేసుకోని వారికి సంఘం ద్వారా ఆర్థిక సాయం అందించే అవకాశం ఉండదని తెలిపారు.

**ఐక్యంగా ఉంటేనే సంక్షేమం :** జర్నలిస్టులు ఆపదలో ఉన్నప్పుడు మాత్రమే సంక్షేమ సంఘాన్ని గుర్తు చేసుకోకుండా, సంఘంలో సభ్యులుగా చేరి దాని బలోపేతానికి సహకరించాలని నాయకులు కోరారు. అనవసర రాజకీయాలకు దూరంగా ఉంటూ, కొందరు చేస్తున్న ప్రచారాలను నమ్మకుండా జర్నలిస్టులంతా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు."జర్నలిస్టుకు ఆపద వస్తే.. సంక్షేమ సంఘం అండగా ఉండాలి. అందుకోసం ముందుగా ప్రతి జర్నలిస్టు సంఘంలో సభ్యుడిగా ఉండాలి" అనే ఉద్దేశంతో ఉచిత సభ్యత్వ నిర్ణయం తీసుకున్నట్లు వారు తెలిపారు. సమావేశంలో సంఘం సభ్యులు యాదగిరి, పల్లెమోని యాదయ్య, రమాకాంత్‌రెడ్డి, సంతోష్‌కుమార్, సతీష్, సతీష్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ హయాంలోనే గిరిజనుల అభివృద్ధి....

గద్వాల:గద్వాల నియోజకవర్గం కె.టీ.దొడ్డి మండలం మల్లాపురం తండా గట్టు మండలం వాయిలకుంట తండా గ్రామాలలో గిరిజనులకు జనాభా ప్రకారం 6% శాతం ఉన్న రిజర్వేశాన్ని 10% శాతానికి పెంచి, నేటికీ నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి గిరిజన బంధువు కేసీఆర్ చిత్రపటానికి తండాల గిరిజన మహిళలతో కలిసి,బాసు హనుమంతు నాయుడు గారు పాలాభిషేకం చేసి, సంబురాలు జరుపుకున్నారు....అంతక ముందు,?బాసు హనుమంతు నాయుడు ని గిరిజన మహిళలు కేసీఆర్ పాటలకు నృత్యం చేస్తూ,పెద్ద ఎత్తున స్వాగతం పలికారు.....ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు తండాల్లో గిరిజనులు అసౌకర్యాల మధ్య జీవనం కొనసాగించారని గుర్తుచేశారు.బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక తండాల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయన్నారు.రాష్ట్రంలోని 3,146 గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చివేసి వాటికి మహర్దశ వచ్చేలా చేసిన ఘనత అప్పటి సీఎం కేసీఆరదేనన్నారు. ఎస్టీల రిజర్వేషన్లను 6నుంచి 10శాతానికి పెంచారని, గిరిజన విద్యార్థులకు 71 గురుకులాలు ఏర్పాటు చేశారని తెలిపారు.దాదాపు అన్ని గిరిజనతండాలకు తారు రోడ్ల నిర్మాణం చేశారన్నారు. గిరిజనుల సమగ్రాభివృద్ధి కోసం ఎస్టీ స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ను కేటాయించి, చట్టబద్ధత కల్పించిన ఘనత కూడా కెసిఆర్ దేనని అన్నారు.గిరిజన మహిళల సంక్షేమానికి గత కెసిఆర్ గారి ప్రభుత్వంలో అనేక పథకాలను అమలు చేశామని, ప్రభుత్వ పథకాలన్నింటినీ విధిగా వర్తింపజేశామని చెప్పారు.గిరిజన పంచాయతీ భవనాల నిర్మాణానికి రూ.300కోట్లు బీఆర్ఎస్ ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. గత కెసిఆర్ హయంలో గిరిజన జీపీల్లో అభివృద్ధి పనులు జరిగాయని తెలిపారు....కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో గిరిజనులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయకుండా మోసం చేసిందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి మూడేండ్లు గడుస్తున్నా గిరిజనుల కోసం చేసిందేమీ లేదన్నారు.గిరిజనులకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో రేవంత్ సర్కారు పూర్తిగా విఫలమైందని విమర్శించారు.గిరిజన విద్యార్థుల చదువు కోసం రూ.25 వేల నుంచి రూ.లక్ష వరకు ప్రోత్సాహకం అందిస్తామని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం హామీని విస్మరించిందన్నారు..గిరిజనుల హక్కులను కాపాడుతూ వారి ఆత్మగౌరవం,సంక్షేమం, అభివృద్ధి కోసం ఎల్లప్పుడు పాటుపడేది కేవలం బీఆర్ఎస్ పార్టీ మాత్రమేనని స్పష్టం చేశారు.గిరిజనులు కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలన్నారు....కెసిఆర్ గారు గిరిజనతండాలను గ్రామ పంచాయతీలుగా చేసి, గిరిజనులను ప్రజా ప్రతినిధులుగా ఎదిగే అవకాశం కల్పించాలని గుర్తు చేశారు....

ఈ కార్యక్రమంలో జి.రాఘవేంద్ర రెడ్డి,సర్పంచులు సాకి డేవిడ్, తిమ్మప్ప,మాజీ సర్పంచులు కృష్ణవేణి నరేందర్ నాయక్,లక్ష్మీకాంత్ రెడ్డి, అంగడి బసవరాజ్,పటేల్ జనార్దన్ రెడ్డి,ప్రతాప్,రంగ నాయక్,బీచుపల్లి,చక్రీధర్ రెడ్డి,వెంకటేష్ నాయుడు,బాసు గోపాల్,ఎస్.రాము నాయుడు,టీ.రవి,రాజు నాయుడు,బోయలగూడెం నాగరాజు,జాంపల్లి భరత్ సింహారెడ్డి,సోమశేఖర్ రెడ్డి,కిష్టప్ప,బాసు బొజ్జయ్య నాయుడు, వీరేష్ నాయక్, పూడూరు రఘు నాయుడు,ఒదే నాయక్,లక్ష్మారెడ్డి, రాము,పాగుంటప్ప, కరెప్ప, స్వామి,రామకృష్ణ,ఆంజనేయులు,అరవిందు,గోవిందు, రజినీబాబు,నరసింహులు నాయక్,కృష్ణ,మరియు పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు....

## కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో మ్యానిఫెస్టోలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి: మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్



హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో మ్యానిఫెస్టోలో తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్ అల్వాల్‌లో తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ, సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రిలే నిరహార దీక్షలను మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ వాదమే లేదన్న పరిస్థితుల్లో అల్వాల్ జేఏసీ ఆధ్వర్యంలో మొట్టమొదట టెంట్ వేసి తెలంగాణ వాదం ఉందని చాటి చెప్పిన ఘనత అల్వాల్ జేఏసీ ఘనత అన్నారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో ప్రతి ఉద్యమకారుడికి 250 గజాల స్థలం, పెన్షన్, గుర్తింపు కార్డులు, అమరులైన ఉద్యమకారుల కుటుంబాలకు ప్రత్యేక నిధి ఏర్పాటు చేసి రూ.25,000 పెన్షన్ అందిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పటికి 3 సంవత్సరాలు పూర్తి అయిన అమలు చేయలేదన్నారు. హామీల అమలుపై కేకే ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేశారు. కేశవ రావు కమిటీ ఇప్పటికే ఆరు నెలలుగా ఉద్యమకారులతో సమావేశాలు నిర్వహించి అభిప్రాయాలు సేకరించిందని, కేశవ రావు , కోదండరామ్ ముఖ్యమంత్రి తో చర్చించి, ఉద్యమకారుల హామీలను అమలు చేయాలన్నారు.హామీలను అమలు చేయడానికి ఇంకా ఎంత సమయం పడుతుందో వారం రోజుల్లోగా ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించాలని, లేనిపక్షంలో ఉద్యమకారులతో కలిసి చర్చించి తదుపరి కార్యాచరణను ప్రకటిస్తామని మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, మల్కాజిగిరి జేఏసీ మాజీ చైర్మన్ వెంకన్న, మాజీ కార్పోరేటర్ శాంత శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ కార్యాలయంలో జాతీయ సమైక్యత శిబిరం



మహబూబ్‌నగర్ : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని భారత రాష్ట్ర సమితి జిల్లా కార్యాలయంలో జాతీయ సమైక్యతా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్ జాతీయ పతాకం ఎగరవేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, ముడా మాజీ చైర్మన్ వెంకన్న, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆంజనేయులు, సీనియర్ నాయకులు గిరిధర్ రెడ్డి, అనంత రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, జహంగీర్, జంబులయ్య, శ్రీనివాస్ రెడ్డి, సుధాకర్ ఇతర సీనియర్ నాయకులు పాల్గొన్నారు

# గణనాథుల నిమజ్జనంలో అప్రమత్తతే ఆయుధం

## కృష్ణానది తీరంలో గణేష్ నిమజ్జన ప్రదేశాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ





వనపర్తి : గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా పటిష్టమైన ముందస్తు చర్యలు చేపట్టాలి కృష్ణానదిలో నీటి మట్టం తక్కువగా ఉన్నందున నిమజ్జనానికి వచ్చే వాహనాలు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన భద్రత ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్పీ శ్రీమతి సునిత రెడ్డి, సూచించారు. వనపర్తి జిల్లా పెబ్బేరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని రంగాపూర్ కృష్ణానది తీరంలో బ్రిడ్జి వద్ద గణేష్ విగ్రహాల నిమజ్జనం కోసం గుర్తించిన ప్రదేశాన్ని జిల్లా ఎస్పీ శ్రీమతి లిసునిత రెడ్డి, వనపర్తి డీఎస్పీ గిరిబాబు, కొత్త కోట సీఐ ఓ.డి. రమేష్, సంబంధిత పోలీసు అధికారులతో కలిసి నిమజ్జన ప్రదేశాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి అక్కడి పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా కృష్ణానదిలో ప్రస్తుతం నీటి మట్టం తక్కువగా ఉండటంతో గణేష్ విగ్రహాలను తీసుకువచ్చే వాహనాలు నిమజ్జన ప్రదేశం వరకు వెళ్లేందుకు ఎదురయ్యే ఇబ్బందులను ఎస్పీ పరిశీలించారు. వాహనాల రాకపోకలు, భక్తుల సురక్షిత రాకపోకలు, నిమజ్జన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోలీసు బందోబస్తు తదితర అంశాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. వినాయక నిమజ్జనం సందర్భంగా భక్తులు, నిర్వాహకులు పోలీసుశాఖ సూచనలను తప్పనిసరిగా పాటించాలి. నీటి మట్టం, నదీ తీర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రమాదకర ప్రాంతాల్లోకి వెళ్లకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. నిమజ్జనానికి వచ్చే వాహనాల నిర్వాహకులు కూడా పోలీసుల సూచనలకు అనుగుణంగా వ్యవహరించాలి. అందరి సహకారంతో గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని శాంతియుతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు పోలీసుశాఖ అన్ని చర్యలు చేపడుతుందని నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలని నిమజ్జన ప్రదేశంలో భద్రతా ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని గణేష్ నిమజ్జన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో, ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సురక్షితంగా జరిగేలా పటిష్టమైన ముందస్తు ఏర్పాట్లు చేయాలి. కృష్ణానదిలో నీటి మట్టం తక్కువగా ఉన్నందున గణేష్ విగ్రహాలను తీసుకువచ్చే వాహనాలు నిమజ్జన ప్రదేశానికి సులభంగా చేరుకునేలా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలి. భక్తులు, నిర్వాహకుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ప్రతి అంశాన్ని ముందుగానే పరిశీలించి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎస్పీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి డీఎస్పీ గిరిబాబు, కొత్తకోట సీఐ, ఓ.డి. రమేష్, పెబ్బేరు ఎస్సై వెంకటేష్ గౌడ్, శ్రీరంగాపూర్ ఎస్సై, హిమబిందు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి భారీ చేరికలు



దేవరకద్ర : దేవరకద్ర నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు కొనసాగుతున్నాయి, నేడు భూత్పూర్ మండలం వెల్కిచర్ల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీకి చెందిన ముఖ్య నాయకులు, మాజీ సర్పంచ్ జగ్గి రెడ్డి , సుదర్శన్ రెడ్డి , నిరంజన్ రెడ్డి , సమరసింహారెడ్డి , సాలె రామస్వామి , దాసరి చెన్నారెడ్డి , హరిజన్ ఉషన్న గారు, వెంకంపల్లి దామోదర్ రెడ్డి , శివారెడ్డి వెంకటయ్య , కుమ్మరి చెన్నయ్య గార్లతో పాటు పెద్ద ఎత్తున బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బిజెపి నాయకులు తదితరులు దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (GMR) సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జియంఆర్ వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు మరియు నియోజకవర్గంలో ఎమ్మెల్యే జియంఆర్ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేశిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ శేఖర్ రెడ్డి, స్థానిక నాయకులు రామ్ రెడ్డి, సురేష్ గౌడ్, పర్వతాలు, ఉపసర్పంచ్ రమేష్, పలువురు వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీసీ-బీ కురవలై ఉండి నకిలీ ఎస్సీ సర్టిఫికెట్లతో ఎంబీబీఎస్ దోపిడీ!

ఆత్మకూర్, సెప్టెంబర్ 17 : వనపర్తి జిల్లా ఆత్మకూర్ లో సంచలనం! బీసీ–బీ (కురవ) కులస్తులై ఉండి, నకిలీ ఎస్సీ (మాదాసి కురవ/మాదిగ) సర్టిఫికెట్లు సృష్టించి ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్ సీట్లు, ప్రభుత్వ ఉద్యోగాలు దోచుకుంటున్న భారీ మోసం వార్త నిర్భయం పత్రిక వెలుగులోకి తెచ్చిందని. ఈ దోపిడీపై సమగ్ర విచారణ జరిపి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని వార్త నిర్భయం ఎడిటర్ కాడెపాగు అశోక్‌లి గురువారం ఆత్మకూర్ ఎస్సై జయన్నకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఒకే కుటుంబంలో ముగ్గురికి మూడు కులాలా? దోపిడీకి ఇదే సాక్ష్యం! ఫిర్యాదులో అత్యంత కీలక అంశం – ఒకే కుటుంబంలో తండ్రికి ఒక కులం, కొడుక్కి ఒక కులం, కూతురికి ఇంకో కులం! ఎస్సీ రిజర్వేషన్ ను అడ్డం పెట్టుకుని ఇలా పిల్లలకు సీట్లు, ఉద్యోగాలు పొందడం ఎంతవరకు న్యాయమని అశోక్ నిలదీశారు. ఇది నిజమైన ఎస్సీ విద్యార్థుల నోట్లో మట్టి కొట్టడమేనని మండిపడ్డారు.

**దోపిడీకి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నవారు:**
బెన్న వెంకట సుధీర్ (వైభవ్ షాప్, ఆత్మకూర్) ఫ్యామిలీ:బి. మణికంఠ: ఉస్మానియా మెడికల్ కాలేజీలో 2018–19లో ఎంబీబీఎస్ సీటు కొట్టి ప్రస్తుతం డాక్టర్ గా ప్రాక్టీస్!బెన్న రమ్య (Roll: 4201103866, Rank: 92328): 2020–21లో మహబూబ్ నగర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు. 2. రాగె దైవదీనం ఫ్యామిలీ, ఆత్మకూర్:రాగె సాహితి (Roll: 4208030393): 2024–25లో మహేశ్వరం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీట్లు వీరితోపాటు చాలామంది ఉన్నారని అన్నారు

**కలెక్టర్ నివేదికే నిదర్శనం :** గతంలో జిల్లా కలెక్టర్ నివేదిక ప్రకారమే ఆత్మకూర్ ప్రాంతంలో అసలు మాదాసి కురవలు లేరని తేలిందని, అయినా ఇంతమంది ఎలా సర్టిఫికెట్లు పొందారో ఆరా తీస్తే అధికారుల–దళారుల కుమ్మక్కు బయటపడుతుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. నకిలీ సర్టిఫికెట్లు వెంటనే రద్దు చేయాలి, ఎంబీబీఎస్ సీట్లు రద్దు చేసి నిజమైన ఎస్సీ విద్యార్థులకు ఇవ్వాలి, IPC 420, 468, 471 మరియు SC/ST సర్టిఫికెట్ చట్టం ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదు స్వీకరించిన ఎస్సై జయన్న విచారణ జరిపి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇది ఆత్మకూర్ లో ఒకరిద్దరి వ్యవహారం కాదు, మండల వ్యాప్తంగా జరిగిన పెద్ద కుల సర్టిఫికెట్ స్కామ్ కు ఇది కేవలం ట్రైలర్ మాత్రమే!

## అమరచింత డెవలప్మెంట్ ఫోరమ్ ప్రస్థానం

అమరచింత : బ్యాంక్ సేవల కోసం అమరచింత ప్రజలు ఇటు అమరచింత యూనియన్ బ్యాంక్ లో, అటు ఆత్మకూరు SBI బ్యాంక్ లో ఏ చిన్న పని ఉన్న దాదాపు ఎన్నో గంటలు సమయం వేచి ఉండటం గమనించి ఎందుకు అమరచింత ఊరిలో మరో జాతీయ బ్యాంక్ ఏర్పాటు చేసుకోలేమా అనీ కేవలం ఐదుగురశీ కలిసి (రిపోర్టర్ అజ్జపాగు రఘు, సత్యేందర్, రవికుమార్,ఫీరోజ్, బాలకృష్ణ) ఎలా ముందుకు పోవాలని చర్చించుకొని ఒక వేదిక ఏర్పాటు చేసుకొనడం జరిగింది.. ఆ వేదికనే అమరచింత డెవలప్మెంట్ ఫోరమ్ (ADF) తేదీ 20-10-2024 ప్రారంభం.... ADF మొదటి లక్ష్యం SBI బ్యాంకు సాధన ప్రస్థానం తర్వాత SBI అధికారుల చుట్టూ తిరుగుతూ వారికీ అమరచింత లో బ్యాంకు ఏర్పాటు ఆవశ్యకత, భౌగోలిక స్థితి వివరించడశీ జరిగింది. మేము చేస్తున్న ఈ ప్రయత్నాలను గమనిస్తూ నర్సిములు గౌడ్,మరాఠి అశోక్, కొంగరి భాస్కర్ మా ADF టీం తో జత కలసిన తర్వాత మాలో నైతిక బలం పెరిగింది.వారి ద్వారా గౌరవ పెద్దలు BACK BONE OF AMARACHINTHA దేశాయ్ ప్రకాష్ రెడ్డి వెన్ను దన్నుగా నిలవడం తో మాకు కొండంత బలం పెరిగి SBI బ్యాంక్ సాధిస్తాం అనే నమ్మకం పూర్తి స్థాయిలో పెరిగింది. SBI సాధనలో మహబూబ్ నగర్ MP అరుణమ్మ రిఫరెన్స్ లెటర్ బ్యాంక్ అధికారుల దృష్టిలో అమరచింత కు స్థానం కలిగింది. కేవలం రిఫరెన్స్ లెటర్ ఇవ్వడం కాకుండా ఈ విషయం పై ప్రత్యేక చొరవ తీసుకోవాలని బంగ్లా లక్ష్మి కాంత్ రెడ్డి కీ బీజేపీ టౌన్ ప్రెసిడెంట్ మంగ లావణ్య కు బాధ్యత అప్పగించడం జరిగింది.వారూ బ్యాంక్ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరిపారు. ఇన్ని ప్రయత్నాలు జరుగుతున్నప్పటికి కొందరు సృష్టించిన అసత్య ప్రచారాల మూలంగా రెండు సార్లు బ్యాంక్ అధికారుల సర్వే లో anti రిపోర్ట్ వచింది..దీనివల్ల చైతన్యం అయినా అమరచింత అఖిల పక్షాల నాయకులు మూడవ సారి SBI సర్వే కు వచ్చిన అధికారులకు వివరించడం గ్రామ అభివృద్ధి విషయంలో మేమంతా ఒకే పక్షం అనీ ఒక సమావేశంలో రుజువు చేయడం ఆ సమావేశంలో పెద్దల తో పాటు SBI లీగల్ అడ్వైసర్ ప్రసాద్ ఊరుకు రావడం మన ఐక్యమత్యం గమనించడం వల్లనే మన అమరచింత పరిసర గ్రామాల ప్రజల చిరకాల ఆకాంక్ష అయినా SBI బ్యాంక్ ఏర్పాటు సాకారం అయింది. ఈ SBI బ్యాంక్ సాధనలో పాలు పంచుకున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

## జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన జిల్లా ఎస్పీ



వనపర్తి : ప్రజల రక్షణ, ప్రజలకు నిరంతర సేవలందించడమే పోలీసుల ప్రథమ కర్తవ్యం. ప్రజాపాలన స్ఫూర్తిని ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది తమ విధుల్లో ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను సానుభూతితో విని, చట్టపరంగా పరిష్కరించి వనపర్తి జిల్లా పోలీసుకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, అన్నారు . తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఉదయం 9:15 గంటలకు జిల్లా ఎస్పీ శ్రీమతి లిసునిత రెడ్డి, సాయుధ పోలీసుల గౌరవ వందనం స్వీకరించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జాతీయ గీతాలాపన నిర్వహించి పోలీసు అధికారులు, సిబ్బంది, జిల్లా ప్రజలకు ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. తెలంగాణకు ఘనమైన చారిత్రక, సాంస్కృతిక వారసత్వం ఉందని శాతవాహనులు, కాకతీయుల వంటి మహోన్నత రాజవంశాల పాలనతో తెలంగాణ ప్రాంతం చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని తెలిపారు. 1948 సెప్టెంబర్ 17న తెలంగాణ ప్రాంతం భారతదేశంలో అంతర్భాగంగా చేరి ప్రజాస్వామ్య పాలనా వ్యవస్థలోకి అడుగుపెట్టిన చారిత్రక ఘట్టాన్ని స్మరించుకుంటూ ప్రజాపాలన దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని అన్నారు. ప్రజల సంక్షేమం, భద్రత, అభివృద్ధి కోసం ప్రభుత్వ సేవలను ప్రతి పల్లెకు, ప్రతి వాడకు, ప్రతి ఇంటికి చేరవేయడమే ప్రజాపాలన ప్రధాన లక్ష్యమని ప్రజల రక్షణే పోలీసుల ప్రథమ కర్తవ్యం. ప్రతిరోజును ఒక సేవా దినంగా భావించి ప్రజలకు అందుబాటులో ఉండాలి. బాధితుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరిస్తూ, చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి. విధి నిర్వహణలో నిజాయితీ, నిబద్ధత, క్రమశిక్షణతో పాటు పరస్పర సమన్వయాన్ని పెంపొందించుకోవాలని పోలీసు అధికారులు, సిబ్బందికి సూచించారు. ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసే విధంగా పోలీసు శాఖ పనిచేయాలని, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజా సమస్యల పరిష్కారంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏ ఆర్ అదనపు ఎస్పీ, వీరా రెడ్డి,వనపర్తి డీఎస్పీ గిరిబాబు, జిల్లా పోలీసు కార్యాలయం ఏఓ సునంద, వనపర్తి సీఐ, సుగంధ రత్నం కొత్తకోట సీఐ, ఓడి, రమేష్, స్పెషల్ బ్రాంచ్ సీఐ, నరేష్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు అప్పలనాయుడు, శ్రీనివాస్, జిల్లాలోని ఎస్సైలు, పోలీసు అధికారులు, సిబ్బంది, జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్ ఇచ్చిన ఆత్మగౌరవంతో మారిన తండాల రూపురేఖలు : మాజీ ఎమ్మెల్యే ఆల



దేవరకద్ర :గిరిజనుల రిజర్వేషన్లు పెంచిన ఘనత కేసీఆర్ కి దక్కుతుంది..ఇది కేవలం రిజర్వేషన్ కాదు...గిరిజనుల ఆత్మగౌరవానికి ఇచ్చిన గౌరవం..కేసీఆర్ తండాలను గ్రామ పంచాయతీలు చేసి దశాబ్దాల డిమాండ్ నెరవేర్చారు..గ్రామ పంచాయతీలుగా ఏర్పాటైన తర్వాత తండాల రూపురేఖలు మారిపోయాయని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి ...అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూత్పూర్ మండలం పెద్ద తండాలో గిరిజనులకు రిజర్వేషన్ల పెంపు చారిత్రక నిర్ణయానికి నాలుగేళ్లు పూర్తైన సందర్భంగా దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి,తండావాసులతో కలిసి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. దేవరకద్ర నియోజకవర్గ గిరిజన సోదర,సోదరీమణుల తరుపున బీఆర్ఎస్ అధినేత,మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.... బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తండాలు అన్ని రకాలుగా అభివృద్ధి చెందాయన్నారు. మిషన్ భగీరథతో దశాబ్దాలుగా మంచినీటి కోసం గోసపడ్డ గిరిజన సోదరీమణుల కష్టాలుతొలగిపోయాయన్నారు. రిజర్వేషన్లు ఆరు నుండి పది శాతానికి పెంచి గిరిజనుల అభ్యున్నతికి బాటలు వేశారని కొనియాడారు. ముఖ్యంగా తండాలను గ్రామ పంచాయతీలుగా చేసి దశాబ్దాల డిమాండ్‌ను కేసీఆర్ నెరవేర్చారన్నారు. దీంతో తండాల రూపురేఖలు మారిపోయాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు పూర్తి కావస్తున్న గిరిజనులకు ఇచ్చిన హామీలు చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ గిరిజనులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

## సర్వ వృత్తులకు మూల పురుషులు శ్రీ శ్రీ జగద్గురువు విరాట్ విశ్వకర్మ భగవాన్

### శిల్పకళ ,సంస్కృతి, సాంప్రదాయాలకు విశ్వకర్మ ఆదర్శనీయులు.




వనపర్తి : శ్రీ శ్రీ జగద్గురువు విరాట్ విశ్వకర్మ భగవాన్ జన్మదినాన్ని పురస్కరించుకుని శ్రీ విరాట్ విశ్వకర్మ యజ్ఞం సందర్భంగా వనపర్తి పట్టణంలో గల బ్రహ్మంగారి దేవాలయం నందు శ్రీ బ్రహ్మం దేవాలయ అభివృద్ధి కమిటీ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ మహా యజ్ఞం ఘనంగా నిర్వహించినారు. ఈ ప్రత్యేక పూజలలో ముఖ్య అతిథిగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వకర్మలు సాదరంగా ఆహ్వానించి నిరంజన్ రెడ్డి ని సన్మానించారు. వేద పండితులు శాస్త్రోక్తంగా ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ శిల్పకళ సంస్కృతి సాంప్రదాయాలకు,వృత్తి నైపుణ్యాలకు ఆదర్శ గురువు శ్రీ విరాట్ విశ్వకర్మ జద్గురువు అని కొనియాడారు. నిరంజన్ రెడ్డి వెంట నందిమల్ల.అశోక్,ప్రేమ్ నాథ్ రెడ్డి, గుడి అభివృద్ధి కమిటీ యాదాచారి ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ చారి మరియు వనపర్తి పట్టణ స్వర్ణకార సంఘం అధ్యక్షుడు బులియన్ మాచర్ల అధ్యక్షుడు బంగారు అనిల్ కుమార్ స్వర్ణకార జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యాంసుందర్ ఆచారి వనపర్తి పట్టణ స్వర్ణకార సంఘం అధ్యక్షులుమోహనచారీ. పి నవీన్ ఆచారి కపిలవాయి ప్రసాద్ అనిల్ జాయిని మధు తదితరులు ఉన్నారు.

## మూసాపేట్ మండలం వేములలో రక్తదాన శిబిరం నూతన బీజేపీ పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం



దేవరకద్ర : నియోజకవర్గ పరిధిలోని మూసాపేట మండలం వేముల గ్రామంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పుట్టిన రోజు సందర్భంగా బీజేపీ కార్యకర్తలు రక్త దానం చేశారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డోకూర్ పవన్ కుమార్ రెడ్డి, దేవరకద్ర నియోజకవర్గ బీజేపీ ఇన్చార్జ్ కొండ ప్రశాంత్ రెడ్డి విచ్చేశారు. వారు మాట్లాడుతూ రక్త దానం చేయడం వలన ప్రమాదానికి గురైనప్పుడు మరియు అత్యవసర పరిస్థితుల లో ఒక నిండు ప్రాణాన్ని నిలుపుతుందని వారు తెలిపారు. అనంతరం బిజెపి మండల పార్టీ నూతన కార్యాలయం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మూసాపేట్ మండల అధ్యక్షుడు టికె నరసింహ,కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి, కొండా రెడ్డి,రవీందర్ గౌడ్, శశి గౌడ్,తిరుపతయ్య,విష్ణుశ్రీనివాస్ నాయక్, భీమయ్య, బుచ్చి రెడ్డి,చందు, ముఖ్య నాయకులు ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## మండల స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించిన వడ్డేపల్లి శ్రీనివాసులు, మున్సిపల్ చైర్మన్ మంజుల ధర్మ



అలంపూర్ : వడ్డేపల్లి మున్సిపాలిటీ కేంద్రంలోని శాంతినగర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆవరణలో మండల స్థాయి క్రీడా పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీసీ సీనియర్ నాయకులు, మాజీ జడ్పీటీసీ వడ్డేపల్లి శ్రీనివాసులు , వడ్డేపల్లి మున్సిపల్ చైర్మన్ మంజుల ధర్మ , మున్సిపల్ కమిషనర్ అశోక్ రెడ్డి ఎస్ఐ శేఖర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి శ్రీనివాసులు మాట్లాడుతూ.. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని అన్నారు. క్రీడల ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, జట్టు స్ఫూర్తి పెంపొందుతాయని తెలిపారు. విద్యార్థులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని, గెలుపోటములను సమానంగా స్వీకరించి క్రీడా స్ఫూర్తిని కాపాడుకోవాలని సూచించారు. క్రీడా పోటీల్లో పాల్గొనే ప్రతి విద్యార్థికి తమ శుభాకాంక్షలు తెలియజేస్తూ.. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఉన్నత స్థాయికి ఎదిగి పాఠశాలకు, మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పాఠశాల సమస్యలపై స్పందన -కార్యక్రమం సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలోకి గూగు వస్తుండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వడ్డేపల్లి శ్రీనివాసులు గారి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఆయన సమస్యను అతి త్వరలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా, సురక్షితంగా ఉంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు.

**బి ఎల్ ఏ -2లదే ప్రధాన భూమిక.**
**నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదు.**
**SIR ప్రక్రియపై అప్రమత్తంగా పనిచేయాలి.**
**నిర్లక్ష్యానికి తావివ్వొద్దు, చిన్న తప్పిదాలు కూడా సరిచేయాలి.**
**-ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి.**

## ప్రతి ఓటు ఎంతో ముఖ్యం



వనపర్తి సమయం ప్రతినిధి : SIR కార్యక్రమంలో భాగంగా వనపర్తి పట్టణంలోని RG గార్డెన్స్‌లో గురువారం BLA-2ల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శివసేనారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మల్లేష్ యాదవ్, శత్రురావు శిక్షకులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ, ప్రతి ఓటు ఎంతో విలువైనదని, SIR ప్రక్రియలో BLA-2ల బాధ్యత కీలకమన్నారు. బూత్ పరిధిలోని ఓటర్ల వివరాలను జాగ్రత్తగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కు సక్రమంగా ఇందులో చూసి సరి చేయాలన్నారు. ఓటరు నమోదు, వివరాల సవరణ సమయంలో చిన్నపాటి పొరపాట్లకు కూడా అవకాశం ఇవ్వకూడదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. పేరు, చిరునామా, ఇతర వివరాల్లో తప్పులు ఉంటే వాటిని గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సకాలంలో సరిచేయించాలని చెప్పారు. వివరాల పరిశీలనకు సంబంధించి కొంతమంది ఓటర్లకు నోటీసులు అందుతున్న నేపథ్యంలో, వాటిని నిర్లక్ష్యం చేయకుండా అవసరమైన పత్రాలు, వివరాలను వెంటనే సమర్పించేలా అవగాహన కల్పించాలని BLA-2లకు సూచించారు. పనిచేయని చోట కొత్త BLA-2లు ప్రతి బూత్‌లో BLA-2లు క్రియాశీలకంగా పనిచేయాలనీ, సక్రమంగా పనిచేయని BLA-2ల వివరాలను సేకరించి, అవసరమైన ప్రాంతాల్లో కొత్తవారిని నియమించుకునేలా చర్యలు ఉంటాయన్నారు. SIR ప్రక్రియలో ఓటర్ల వివరాల పరిశీలన, తప్పుల సవరణ, అర్హులైన ఓటర్ల నమోదుకు సంబంధించిన అంశాలపై శిక్షణలో అవగాహన కల్పించారు. ఎన్నికల జాబితాలో అర్హులైన ఓటర్ల హక్కులు పరిరక్షించబడేలా, ప్రతి బూత్‌లో BLA-2లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శిక్షకులు దృశ్య మాధ్యమం ద్వారా SIR కార్యక్రమానికి సంబంధించిన అంశాలను BLA -2 వివరంగా వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతయ్య, సాయి చరణ్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు, మండల అధ్యక్షులు, మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్ పట్టణ అధ్యక్షులు కదిరె రాములు కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విమోచన దినోత్సవం కాదు ముమ్మాటికి విలీన దినోత్సవం



వనపర్తి : తెలంగాణ విలీన దినోత్సవం సెప్టెంబర్ 17సందర్భంగా మాజీ మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి జిల్లా పార్టీ కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ జాతీయ సమైక్యత,సమగ్రత కోసం నాటి నిజాం సంస్థానం భారత యూనియన్ లో 1948సెప్టెంబర్ 17న విలీనం చేయబడ్డది కాబట్టి ఇది ముమ్మాటికి విలీన దినోత్సవంగా జరుపుకోవాలని పునరుద్ఘాటించారు. ప్రజలు కోసం సాయుధ పోరాటం చేసి ఎందరో అమరులై ప్రజాస్వామ్యం, హక్కులు,సమైక్యత కోసం భారత యూనియన్ లో విలీనం అయినారని అందుకే జాతీయ సమైక్యత దినోత్సవంగా బి.ఆర్.ఎస్ భావిస్తోందని అన్నారు. నాటి నుండి నేటి వరకు తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ శాశ్వత శత్రువుగా చరిత్రలో నిలిచిపోయిందని ముమ్మాటికి తెలంగాణ ప్రయోజనాలను దెబ్బతీసిన పార్టీ కాంగ్రెస్ అని దుయ్యబట్టారు. నేటి కాంగ్రెస్ పార్టీ పాలనలో కరెంట్ కోతలతో,సాగు జలాల కొరతతో,యూరియా కొరతతో,సంక్షేమ పథకాల కొరతతో తెలంగాణలో అస్తవ్యస్త పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వంపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గట్టు యాదవ్ వాకిటి.శ్రీధర్, పలుస.రమేష్ గౌడ్ నందిమల్ల.అశోక్,గంధం.పరంజ్యోతి వనం.రాములు, దిలీప్ రెడ్డి,రఘువర్ధన్ రెడ్డి,వెంకటస్వామి,శివరామ్ రెడ్డి,ఉంగ్లం.తిరుమల్, చంద్రశేఖర్ నాయక్,జాత్రు నాయక్, దేవర్ల.నరసింహ,కౌన్సిలర్స్ భారతి ప్రేమ్ నాథ్ రెడ్డి,మురళి సాగర్,స్వాతి హరిబాబు,శిరీష రమేష్ గౌడ్,పలుస.శంకర్ గౌడ్,గులాం ఖాదర్ ఖాన్,జోహెబ్ హుస్సేన్, చిట్యాల.రాము, మంద.రాము,మహిళా నాయకురాలు నాగమ్మ,కవితా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## గణనాథుని సేవలో మహిళా కార్పొరేటర్లు



మహబూబ్‌నగర్ : నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గణేష్ ఉత్సవాల్లో భాగంగా ప్రతిష్ఠించిన శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారికి నగరంలోని పలు డివిజన్ల మహిళా కార్పొరేటర్లు సువర్ణ కిషన్ నాయక్, దేప్లీ మేఘ్యా నాయక్, వెన్నెల రఘు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయకుడి ఆశీస్సులతో మహబూబ్‌నగర్ నగర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ప్రజలంతా సోదరభావంతో పండుగలను, పర్వదినాలను ఆనందంగా జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ సిబ్బంది, నాయకులు తులసీరాం నాయక్, మేఘ్యా నాయక్, రఘు తదితరులు పాల్గొన్నారు.

## దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిస్తే సహించేది లేదు






చిన్న చింతకుంట : కురుమూర్తి గ్రామంలో దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే విధంగా BRS పార్టీ నాయకులు వ్యవహరించారని ఆరోపిస్తూ, కాంగ్రెస్ పార్టీ దళిత నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితుల గౌరవాన్ని దెబ్బతీస్తే ఎలాంటి చర్యలనైనా కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (GMR) ఆదేశాల మేరకు, చిన్న చింతకుంట మండల కాంగ్రెస్ పార్టీ SC సెల్ అధ్యక్షుడు పి.నాగరాజు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు దళితులు డప్పు సప్పులతో కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే విధంగా ఎవరైనా వ్యవహరిస్తే చూస్తూ ఊరుకునేది లేదని, దళితుల గౌరవం, హక్కులు, ఆత్మగౌరవం కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ సమాన గౌరవం ఉండాలని, కులం పేరుతో ఎవరినీ అవమానించడం సరికాదని పేర్కొన్నారు. దళిత సమాజాన్ని అవమానించే రాజకీయాలకు ప్రజలు తగిన సమాధానం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. BRS పార్టీ నాయకులు తమ వైఖరిని మార్చుకుని దళిత సమాజానికి గౌరవం ఇవ్వాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బాధ్యతగా వ్యవహరించాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు.. ఈ కార్యక్రమంలో... గ్రామ సర్పంచ్ కురుమన్న , మార్కెట్ యాడ్ చైర్మన్ కథలప్ప ,గ్రామ SC సెల్ అధ్యక్షుడు మాసన్న , మండల సీనియర్ నాయకులు కురుమూర్తి సురేష్ , యూత్ ప్రెసిడెంట్ M.శేఖర్, కాంగ్రెస్ నాయకులు శంకర్, సీనియర్ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీ మల్టీ స్పెసిలిటీ హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న: డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి



పెబ్బేరు: పట్టణ కేంద్రంలో శ్రీ లక్ష్మీ మల్టీ స్పెసిలిటీ హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వారి యజమాన్యం ఆహ్వానం మేరకు పాల్గొన్న మాజీ మంత్రివర్యులు డాక్టర్ జిల్లేల చిన్నారెడ్డి వారిని హాస్పిటల్ యాజమాన్యం స్వాగతం పలికి శాలువాతో సన్మానించడం జరిగింది. మాజీ మంత్రి డాక్టర్ జిల్లేల చిన్నారెడ్డి ఇట్టి కార్యక్రమానికి విచ్చేసిన దేవరకద్ర శాసనసభ్యులు "జి మధుసూదన్ రెడ్డి హాస్పిటల్ అంతటిని పరిశీలించి ఆపరేషన్ థియేటర్లను ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా చిన్నారెడ్డి కూడా హాస్పిటల్ డాక్టర్ ని సన్మానించి వారికి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జి.మన్యం. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాంపురం సహదేవుడు, అయ్యవారిపల్లి గ్రామ సర్పంచ్ కురుమూర్తి,జానంపేట మహేశ్వర్ రెడ్డి,అయ్యవారిపల్లి ఆనంద్ సాగర్, పాతపల్లి చంద్రశేఖర్, తిప్పాయిపల్లి ఎల్ల స్వామి నాయుడు, గట్టు రాజు, నందిమల్ల రాము ,బొట్టు శ్రీను, రాజు నాయక్ తిరుపతయ్య శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 20 ఏళ్లకు మొదలైన భూత్పూర్ కాలువ పూడికతీత జమ్ము ముళ్లపొదలు తొలగింపు పనులు

అమరచింత : భూత్పూర్ కాలువ పూడిక తీత పనులు 20 ఏళ్ల తర్వాత మొదలయ్యాయి. మండల పరిధిలోని పామ్ రెడ్డి పల్లె నుండి పూడిక తీత పనులు స్టార్ట్ అయ్యి పిన్నంచర్ల బా లకిష్ట పురం వరకు.. కొనసాగుతున్నాయి. భూత్పూర్ కాలువ తవ్వి 20 సంవత్సరాలు కావస్తున్న తవ్విన కాలువకు నీళ్లు రాక. జమ్మూ. పూడిక నిండి.పుడిపోయి రైతులు. అష్ట కష్టాల పాలయ్యారు. దీంతో ప్రజాప్రతినిధులకు అధికారులకు మొరపెట్టుకో వడం జరిగింది ఈ విషయంలో స్పందించిన మంత్రి వాకిట శ్రీహరి ఆదేశాలతో ఈరోజు పామ్ రెడ్డి పల్లె నుండి పిన్నంచర్ల బాలకిష్ట పురం వరకు. పుడికతీత పనులు మొదలయ్యాయి. ఇన్ని సంవత్సరాల కాలువ కష్టాలు తీరినందుకు రైతుల ఆనంద భాష్పాలు. సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈరోజు మొదలైన కాలువ. పామ్ రెడ్డి పల్లె అమరచింత. పెద్ద చెరువు. కొంకనోని పల్లి. గడ్డమీద తండా. చంద్రప్ప తాండ. తుక్య నాయక్ తండ. అల్లిపురం రైతులు. పిన్నంచెర్ల రైతులు. బాలకిష్ట పురం రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు ఈ భూత్పూర్ కాలువ రావడం వలన రైతులకు బోర్లు రీఛార్జ్ అయి. భూగర్భ జలాలు పెరిగి. పశువులకు, జీవాలకు, జంతువులకు, రైతులు పంటలు. పండించుకోవడానికి.మేలు జరుగుతుందని భావిస్తున్నారు, ఈ కార్యక్రమంలో అమరచింత మున్సిపాలిటీ,3. వార్డ్ కౌన్సిలర్, పి.తిరుమలేష్ తెలంగాణ రైతు సంఘం నాయకులు కే,లక్ష్మీనారాయణ పిన్నంచర్ల భరత్ రెడ్డి. పిన్నంచర్ల సర్పంచ్, మల్లేశ్వరావు.ఉప సర్పంచ్ కళ్యాణ్ . శంకర్ నాయక్. ఉప్పరి రంగన్న. పి రఘు. ఎద్దులా ఆంజనేయులు. పి ఆంజనేయులు.చిన్న కురుమన్న.బాయ్ కాడి తిరుపతి.పిన్నంచర్ల రైతులు. కురువ సాయన్న. గొల్ల రామచంద్రి . భూత్పూర్ కాలువ అధికారులు. వర్క్ ఇన్స్పెక్టర్, ఫారుక్.భాస్కర్. శ్రీనివాసులు. భూత్పూర్ కాల్వ సంబంధించిన. రైతులు.తదితరులు పాల్గొన్నారు.

## హమారా ప్రసాద్ పై కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని దళిత సంఘాల నిరసన అమరచింత ఎస్సై కి ఫిర్యాదు



అమరచింత : అమరచింతలో గురువారం దళిత సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం ఎదుట హమర ప్రసాద్ తీరు నిరసిస్తూ నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగిందిలి ఈ సందర్భంగా ఖపూా జిల్లా ఉపాధ్యక్షులు.యస్.ఈ. శ్యామ్ సుందర్. అంబేద్కర్ జాతరకమిటీ జిల్లా అధ్యక్షులు. కె. విజయ్.వీ౯ూా అమరచింత మండలఅధ్యక్షులు ఎ. ప్రశాంత్ కుమార్. మాలల ఐక్యవేదిక మండల అధ్యక్షులు 9వ వార్డు కౌన్సిలర్ వేద విష్ణు. దళిత సంఘశీ జిల్లా నాయకులు యస్. ప్రభుదాసు. 4వ వార్డు కౌన్సిలర్ వనిత ప్రకాశం. ఏడవ వార్డు కౌన్సిలర్. ణజ మాధవి రాజేందర్.కో ఆప్షన్ సభ్యులు యస్. అజయ్. తౌఫిక్.షాజహాన్ బేగం లు మాట్లాడుతూ కల్పిత నాయకుడు అంబేద్కర్ అనె. పుస్తకం రసించి లిఈనెల 18న హైదరాబాదులో విడుదలకు పూనుకున్న నేపథ్యాన్ని నిర సిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని వారు తెలిపారుహమర ప్రసాద్ పై వెంటనే ఎఫ్ఆర్ ఆర్ నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ డిమాండ్ చేస్తూ అమరచింతలోని పోలీస్ స్టేషన్లో దళిత సంఘాల ఆధ్వర్యంలో ఫిర్యాదు చేయడం జరిగింది. లిభారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ అవమానిస్తూ హమారా ప్రసాద్ గతంలోనూ నేను గాడ్సేన్ అయింటే గాంధీని చంపినట్లే అంబేద్కర్ను చంపేవాడినని తీవ్ర పదజాలంతో అంబేద్కర్ను దూషించారని ఇటువంటి క్రూరత్వం కలిగిన హమర్ ప్రసాద్ పై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు18న హైదరాబాదులో బుక్కు రిలీజ్ చేసినందుకు ఏర్పాట్లు చేస్తున్నాడుకనుక వెంటనే ప్రభుత్వం ఆ బుక్కును నిషేధించాలని డిమాండ్ చేశారు. లేనియెడల తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా దళిత గిరిజన ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతమని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండల కార్యదర్శి ఎస్సీ అరుణ్ కుమార్ యస్. విజయ్. ఏ హరీష్ ఏ రవి కుమార్. ప్రత్యూష్. భరత్ అశోక్ కుమార్. శరత్ నెపోల్ జాన్. బాలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలు..




అలంపూర్ : ఇటిక్యాల మండలం జింకలపల్లి స్టేజ్ వద్ద ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర డాక్టర్ సెల్ కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం నాడు మెగా రక్తదాన శిబిరం, ఉచిత వైద్య శిబిరం,కేక్ కటింగ్ అన్నదాన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా అల్లంపూర్ మాజీ ఎమ్మెల్యే రావుల రవీంద్ర నాథ్ రెడ్డి,జిల్లా యువ నాయకురాలు డికె. స్నిగ్ధ రెడ్డి హాజరై మాట్లాడుతూ..ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి, మౌలిక వసతులు, డిజిటల్ సేవలు, పేదల సంక్షేమం వంటి రంగాల్లో అనేక కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నట్లు పేర్కొన్నారు. స్వచ్ఛ భారత్, ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి జనధన్ యోజన, ఉజ్వల యోజన, జల్ జీవన్ మిషన్ వంటి పథకాల ద్వారా ప్రజలకు వివిధ సేవలు అందుతున్నాయని తెలిపారు. దేశంలో మౌలిక వసతుల అభివృద్ధి, రహదారులు, రైల్వేలు, డిజిటల్ కనెక్టివిటీ వంటి రంగాలకు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. పేదలు, రైతులు, మహిళలు, యువత వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. నరేంద్ర మోదీ గారి జన్మదినాన్ని కేవలం వేడుకగా కాకుండా సేవా కార్యక్రమాల దినోత్సవంగా నిర్వహిస్తూ ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్ర రెడ్డి ,రాష్ట్ర కౌన్సిల్ మేంబర్ బండల వెంకట రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి రవి కుమార్ ఎక్బోటే, జిల్లా ఉపాధ్యక్షుడు సంజీవ్ రెడ్డి,జిల్లా బిజెవైఎం అధ్యక్షుడు బాబుల్ రెడ్డి, మహిళ మోర్చా అధ్యక్షురాలు సమత మధు గౌడ్, మండల అధ్యక్షులు జగదీష్ రెడ్డి, శ్రీనివాసులు బిజెపి సీనియర్ నాయకులు మీర్జాపురం వెంకటేశ్వర రెడ్డి, అబ్దుల్,సతీష్ ,తిరుమల్ తదితరులు ఉన్నారు.

# ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా
# ఘనంగా జాతీయ పతాకావిష్కరణ



**నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి సెప్టెంబర్ 17:** ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ ప్రాంగణంలో రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రాణాలర్పించిన అమరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిరిసిల్ల రాజయ్య పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, , అదనపు కలెక్టర్లు దేవ సహాయం, బి. చెన్నయ్య, మున్సిపల్ చైర్మన్ తీగల సురేంద్ర, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

**తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ – సందేశం సోదర సోదరీమణులారా !**

నేటి తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా, స్వాతంత్ర్య సమరయోధులకు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులకు, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు, జిల్లాలోని ముఖ్యులకు, ఉద్యోగస్తులకు, విద్యార్థిని విద్యార్థులకు, మీడియా, పత్రికా ప్రతినిధులకు, ప్రత్యేకించి జిల్లా ప్రజలకు నా యొక్క హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ స్వాగతం పలుకుతున్నాను.తెలంగాణ చరిత్ర ఈనాటిది కాదు, క్రీస్తు పూర్వం నుంచే ఈ గడ్డ మీద అభివృద్ధి చెందిన నాగరికత ఉంది. వేల ఏండ్ల చరిత్రలో ఎంతోమంది పాలించారు. భూస్వాముల దగ్గర బానిసలుగా బతకాల్సిన పరిస్థితి. అలాంటి పరిస్థితులను ఎదిరించి నిలవడానికి ఎన్నో పోరాటాలు చేయాల్సి వచ్చింది. అందులో ముఖ్యమైనది 1946 లో ప్రారంభమయిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం. అప్పటి పోరాటంలో ఎందరో ప్రాణాలను కోల్పోవడం జరిగింది. ఒక వైపు రైతాంగ పోరాటం జరుగుతున్న సమయంలోనే 1947 లో మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. 1947 నాటికి 565 ప్రిన్సిలీ స్టేట్స్ మరియు 1000 కి పైగా సంస్థానాలు ఇండియన్ యునియన్ లో కలిసిపోయాయి కాని హైదరాబాద్, జునాఘడ్, కాశ్మీర్ మాత్రం స్వతంత్రశీగా ఉండేందుకు ఇష్టపడ్డాయి. అప్పటి హైదరాబాద్ సంస్థాన పాలకులు తన పాలనలో ఉన్న తెలంగాణ లోని అప్పటి 8 జిల్లాలు నల్లగొండ, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, మహబూబ్ నగర్, నిజామాబాద్, ఆత్రఫ్ బల్దా (హైదరాబాద్), మహారాష్ట్ర లోని నాందేడ్, ఔరంగాబాద్, ఉస్మానాబాద్, పర్బనీ, బీడ్, కర్ణాటక లోని గుల్బర్గా, బీదర్, రాయచూర్ ను కలిపి ఒక ప్రత్యేక దేశంగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కాని సంస్థానం లోని ప్రజలకు మాత్రం భారతదేశంలో కలవాలని ఉండేది. దీంతో ఇండియన్ గవర్నమెంట్ హైదరాబాద్ సంస్థానంపై పోరాటం చేసి హైదరాబాద్ సంస్థానాన్ని 1948 సెప్టెంబర్ 17న భారత్ లో విలీనం చేయడంతో తెలంగాణ గడ్డపై మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. ఈ విధంగా సెప్టెంబర్ 17, 1948న తెలంగాణ ప్రజలకు స్వాతంత్ర్యం లభించింది. కావున ఈ రోజు తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలను రాష్ట్రమంతటా ఘనంగా జరుపుకోవడానికి నిర్ణయించి కార్యక్రమాలను చేయడం జరుగుతున్నది.రాష్ట్రంలో సృష్టిస్తున్న సంపదను సమానత్వం, సామాజిక న్యాయం ప్రాతిపదికగా సమస్త ప్రజానికానికి పంపిణి జరగాలనే లక్ష్యంతో ప్రభుత్వం పురోగమిస్తున్నది. సకల జనుల సంక్షేమానికి పాటుపడుతున్నది. ప్రణాళికాబద్ధమైన విధానాలు, ఆర్థిక క్రమశిక్షణ, ప్రజల సహకారంతో అన్ని రంగాలలో మనం కలిసి పయనిద్దాం. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీలను అమలు చేసేందుకు కంకణం కట్టుకుంది. నేటి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రత్యేక దృష్టి సారించింది. డిసెంబర్ 28 నుంచి సరికొత్తగా ప్రజాపాలన కార్యక్రమం నిర్వహిస్తున్నది. ప్రభుత్వ అధికారులను రాష్ట్రంలోని ప్రతి పల్లెకు, ప్రతి బస్తీకి పంపించి గ్రామ సభలు నిర్వహించడం జరిగింది. సంక్షేమ పథకాలకు అర్హులైన వారందరూ దరఖాస్తులు చేసుకోవాలని ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్నది.రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కార్యక్రమాలలో మన జిల్లా సాధించిన ప్రగతిని ఒక్కొక్కటిగా మీ ముందు ఉంచుతున్నాను.

**మహాలక్ష్మి పథకం:** రాష్ట్ర ప్రభుత్వం 6 గ్యారంటీలలో భాగంగా ప్రభుత్వం అధికారం చేపట్టిన 48 గంటల్లోనే మహాలక్ష్మి పథకాన్ని అమలు చేసింది. ఇందులో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించబడింది. మన జిల్లాలో ఇప్పటికే దాదాపు 10 కోట్ల 56 లక్షల మంది మహిళలు ఈ పథకాన్ని వినియోగించుకున్నారు. ప్రయాణ ఛార్జీల భారం తగ్గిపోవటంతో దాదాపు 499 కోట్ల 85 లక్షల రూపాయలు మహిళలు ఆదా చేసుకున్నట్లయింది.మహాలక్ష్మి పథకంలో భాగంగా 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్ పంపిణీ చేసే పథకం ద్వారా 1 లక్ష 18 వేల వినియోగదారులు 16 కోట్ల 95 లక్షల రూపాయల సబ్సిడీ ద్వారా లబ్ది పొందుతున్నారు.అర్హులైన పేద కుటుంబాలకు ఉచిత గృహ విద్యుత్తును అందించే గృహ జ్యోతి పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. జిల్లాలో 200 యూనిట్లలోపు విద్యుత్తు వాడే 1 లక్ష 15 వేల 461 గృహ వినియోగదారులందరికి 77 కోట్ల 62 లక్షల సబ్సిడీతో జీరో బిల్లులు జారి చేయడమైనది.

**పౌరసరఫరాల శాఖ :** తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సన్న బియ్యం పంపిణి కార్యక్రమం ద్వారా ఏప్రిల్ నెల 2025 సంవత్సరం నుండి రేషన్ కార్డు దారులందరికి ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున 2 లక్షల 79 వేల 133 రేషన్ కార్డులకు గాను 8 లక్షల 99 వేల 385 కుటుంబ సభ్యులకు 3 నెలలకు గాను (ఆగష్టు, సెప్టెంబర్ మరియు అక్టోబర్ 2026) 13,691.128 టన్నుల సన్న రకం బియ్యంను 552 రేషన్ దుకాణాల ద్వారా ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది. కులగణన మరియు మీసేవ ద్వారా వచ్చిన 43 వేల 422 కొత్త దరఖాస్తులను గ్రామ సభలో ఆమోదించుకొని 41 వేల 323 కొత్త రేషన్ కార్డులను మంజూరు చేయటం జరిగింది. మిగిలిన దరఖాస్తులు పరిశీలనలో కలవు మరియు 1 లక్ష 9 వేల 727 కుటుంబ సభ్యులను పాత కార్డులలో అదనంగా చేర్చడం జరిగింది.

**రాజీవ్ ఆరోగ్య శ్రీ :** అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజల ఆరోగ్య సేవలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిచ్చింది. ఆరోగ్య శ్రీ పరిమితిని 5 లక్షల రూపాయల నుండి 10 లక్షల రూపాయలకు పెంచింది. మన జిల్లాలో డిసెంబర్ 9వ తేది నుంచి ఇప్పటి వరకు 44 వేల 115 మంది ఆరోగ్య శ్రీ క్రింద వైద్య సేవలకు గాను ప్రభుత్వం దాదాపు 117 కోట్ల 59 లక్షల 95 వేల రూపాయలను ఖర్చు చేసింది. రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం క్రింద దయాలసిస్ రోగులకు చికిత్స పూర్తి ఉచితంగా అందించబడుతుంది.

**ఇందిరమ్మ ఇండ్లు పథకం :** ఈ పథకం క్రింద జిల్లాకు మొదటి విడతలో 11 వేల 922 ఇండ్లు మంజూరు కాగా 9 వేల 809 లబ్దిదారులకు మంజూరు పత్రాలు జారి చేయడం జరిగింది. ఇందులో 5 వేల 269 ఇండ్లు ప్రగతిలో ఉన్నవి మరియు 2 వేల 361 ఇండ్లు మొత్తంగా పూర్తయినవి. జిల్లాలో ఇప్పటి వరకు 197 కోట్ల 24 లక్షల రూపాయల నిధులు లబ్ధిదారులకు జారి అయినవి. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు రెండవ విడతలో ప్రతి నియోజక వర్గానికి 2 వేల ఇండ్లు మంజూరు చేయడం జరిగింది. వీటిలో గుడిసెలో నివసిస్తున్న 541 లబ్దిదారుల ఎంపిక చేసి మంజూరి పత్రాలు జారి చేయడం జరిగింది.

**ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక:** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక లో భాగంగా “99 రోజుల కార్యాచరణ ప్రణాళిక” మార్చి 6, 2026 నుండి జూన్ 12, 2026 వరకు వివిధ శాఖల కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించుకోవడం జరిగినది.

**వ్యవసాయ శాఖ :**తెలంగాణ రైతులు దేశానికే ఆదర్శంగా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త ప్రణాళికలను రూపొందిస్తోంది. రైతుల సంక్షేమానికి, వ్యవసాయ పురోగతికి అవసరమైన కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నది.

**రైతు భరోసా:**వ్యవసాయం ఒక జీవనవిధానంగా, సంస్కృతిగా సాగుతున్న మనం వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలని, రైతును అగ్రభాగాన నిలపాలనే చిత్తశుద్ధితో, రైతులు అప్పులబారిన పడకుండా తెలంగాణ ప్రభుత్వం దేశములో ఎక్కడాలేని విధంగా రైతులకు పెట్టుబడి సాయంగా ఎకరాకు 6 వేల రూపాయల చొప్పున వానాకాలం మరియు యాసంగి సిజన్లకు కలిపి మొత్తం 12 వేల రూపాయల చొప్పున సీజను ప్రారంభంలో వారి ఖాతాలలో జమచేసే విధంగా ఈ కార్యక్రమాన్ని 2024 జనవరి 26 నాడు అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించడం జరిగింది. ఇందులో భాగంగా 2026-27 వానాకాలంనకు గాను 422 కోట్ల 56 లక్షల రూపాయలను 3 లక్షల 8 వేల మంది రైతుల ఖాతాలలో జమ చేయబడింది.

**రైతు భీమా:** రైతుల జీవితాలకు భరోసా కల్పించాలనే ఉద్దేశముతో 18 నుండి 59 సంవత్సరాల వయస్సు కల్గిన పట్టా రైతులు సహజంగా గాని లేదా ప్రమాదవశాత్తు మరణిస్తే వారి వారసులకు 5 లక్షల రూపాయలను అందజేయడం జరుగుతుంది. ఈ రైతు భీమా పరిహారం రైతు కుటుంబాలకు జీవనోపాధి కల్పించి కుటుంబ పెద్ద లేని లోటును తీరుస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలో 2025-26 సంవత్సరానికి 1,141 మంది రైతుల నామినీలకు ఒక్కొక్కరికి 5 లక్షల చొప్పున మొత్తం 57 కోట్ల 5 లక్షల రూపాయలను వారి బ్యాంకు ఖాతాలలో జమ చేయడమైనది. వరి కొనుగోలు కేంద్రాల ద్వారా జిల్లాలో ఇప్పటి వరకు రభి సీజన్ 2025-26 కు సంబంధించి 200 వరి కొనుగోలు కేంద్రాల ద్వారా 22 వేల 57 మంది రైతుల నుండి 1 లక్ష 18 వేల 93 టన్నుల ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయడం జరిగింది. అందుకు గాను 282 కోట్ల 12 లక్షల రూపాయలను రైతుల ఖాతాలలో జమ చేయడం జరిగింది.తెలంగాణా ప్రభుత్వం సన్న రకం వడ్లకు అదనంగా 500 రూపాయల బోనస్ చెల్లించడం జరుగుతుంది. దీని ద్వారా ఇప్పటివరకు 6 వేల 496 మంది రైతుల నుండి 24 వేల 244 టన్నుల సన్న రకం ధాన్యంను కొనుగోలు చేయడం జరిగింది.

**ఉద్యానవన శాఖ:** సమీకృత ఉద్యాన అభివృద్ధి మిషన్ పథకము క్రింద 2026-27 ఆర్థిక సంవత్సరంలో 1 వేయి 93 ఎకరాల భౌతిక లక్ష్యానికి 1 కోటి 74 లక్షల 67 వేల రూపాయల ఆర్థిక లక్ష్యముగా నిర్ణయించబడినది మరియు ఇప్పటివరకు 575 ఎకరాలకు 96 మంది రైతులకు రూ. 84 లక్షల 86 వేల ఆర్థిక లక్ష్యముతో తోటలను నాటడం జరిగినది. ఇదే పథకంలో 25 ఫాం పాండ్ ల నిర్మాణం కొరకు రూ. 22 లక్షల 50 వేల ఆర్థిక లక్ష్యము కాగా లబ్ది దారుల ఎంపిక మరియు పథకము అమలు ప్రగతిలో ఉన్నది. అదేవిధంగా 47 ప్యాక్ హౌస్ నిర్మాణం కొరకు రూ. 1 కోటి 12 లక్షల 80 వేల ఆర్థిక లక్ష్యము కాగా లబ్ది దారుల ఎంపిక మరియు పథకము అమలు ప్రగతిలో ఉన్నది. పాత తోటల పునరుద్దరణ



కొరకు 113 ఎకరాల భౌతిక లక్ష్యంకు గాను రూ. 10 లక్షల 80 వేల ఆర్థిక లక్ష్యముతో 34 మంది రైతులకు ఈ పథకము అందించడము జరిగినది. 2020-21 నుండి 2025-26 వరకు 2 వేల 153 మంది రైతులు 8 వేల 119 ఎకరాలలో ఆయిల్ పామ్ తోటలను నాటడము జరిగినది. ఇందుకు గాను ఎకరాకు 4 వేల 200 రూపాయల ప్రోత్సాహకం ఇవ్వడం జరిగింది మరియు 2026-27 సంవత్సరంనకు గాను 2 వేల 500 ఎకరాల భౌతిక లక్ష్యంగా ఇప్పటి వరకు 2,147 ఎకరాలలో 631 మంది రైతులు తోటలను సాగు చేయడము జరిగినది. లబ్దిదారుల ఎంపిక మరియు పథకం అమలు ప్రగతిలో ఉన్నది. మైక్రో ఇరిగేషన్ పథకము క్రింద జిల్లాలో 2026-27 సంవత్సరంలో బిందు సేద్యం (డ్రిప్) క్రింద 3,828 ఎకరాల భౌతిక మరియు రూ. 6 కోట్ల 65 లక్షల 21 వేల ఆర్థిక లక్ష్యం కాగా ఇప్పటి వరకు 3,285 ఎకరాలకు గాను రూ. 5 కోట్ల 70 లక్షల 91 వేల ఆర్థిక వ్యయంతో 712 మంది లబ్దిదారులకు ఈ పథకము అందించడము జరిగినది మరియు తుంపర సేద్యము క్రింద 4 కోట్ల 25 లక్షల 59 వేల ఆర్థిక వ్యయంతో 2 వేల 696 మంది లబ్దిదారుల ఎంపిక మరియు పథకం అమలు ప్రగతిలో ఉన్నది. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకము క్రింద 2026-27 ఆర్థిక సంవత్సరంలో తీగ జాతి కూరగాయల పంట సాగు కొరకై శాశ్వత పందిళ్ళ నిర్మాణానికై 80 యూనిట్లకు 40 లక్షల ఆర్థిక వ్యయంతో లబ్దిదారుల ఎంపిక మరియు తోటలు నాటడము ప్రగతిలో ఉన్నవి.

**నీటిపారుదల శాఖ :** మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకమునకు 5 వేల 861 కోట్లు కేటాయించారు. ఈ పథకము ద్వారా మొత్తం ఆయకట్టు 4 లక్షల 51 వేల ఎకరాలకు గాను 3 లక్షల 7 వేల ఎకరాలకు సాగు నీరు ఇవ్వడం జరుగుతుంది. ఈ ఎత్తిపోతల పథకము ద్వారా ఇప్పటి వరకు 357.04 ఎంసీఎఫ్‌టీల నీటిని ఎత్తి పోయడం జరిగింది. మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భాగంగా అచ్చంపేట మరియు ఉప్పునుంతల మండలాలలో 15 వేల ఎకరాలకు సాగునీరు అందించడానికి పులిజాల నుండి చంద్రసాగర్ చెరువు వరకు 15 కిలోమీటర్ల బ్రాంచ్ కెనాల్ నిర్మాణం కొరకు 107 కోట్ల 20 లక్షల రూపాయల పరిపాలన అనుమతులు ఇవ్వడం జరిగినది. అచ్చంపేట లిఫ్ట్ ఇరిగేషన్ స్టేజి-1 పనులకు గాను తెల్కపల్లి, ఉప్పునుంతల, లింగాల, బల్మూర్ మరియు అచ్చంపేట మండలాలలోని 61 గ్రామాలకు 57 వేల 200 ఎకరాలకు నీరందించడానికి 1 వేయి 534 కోట్ల 50 లక్షల రూపాయల అంచనాలతో పరిపాలన అనుమతులు పొంది అగ్రిమెంట్ చేయడం జరిగినది. భూసేకరణ పనులకు సర్వే పనులు పురోగతిలో ఉన్నాయి. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం క్రింద కృష్ణమ్మ నీటిని తరలించి బీడు భూముల్లో 12 లక్షల 30 వేల ఎకరాలకు సాగు నీరు, పల్లెలకు తాగు నీరు, హైదరాబాద్ మహానగరానికి మంచి నీళ్ళు అందించే కార్యక్రమం చేపట్టడం జరిగింది. అందులో భాగముగా 12 ప్యాకేజీల లోని పనులు పురోగతిలో ఉన్నాయి. వట్టెం పుంపు హౌస్ లో 4 పుంపులు డ్రై రన్ పూర్తి చేసి 5వ పంపు డ్రై రన్ చేయుటకు సిద్ధముగా ఉన్నది. మార్కేండేయ ఎత్తి పోతల పథకమునకు 84 కోట్ల 30 లక్షల రూపాయల పరిపాలన అనుమతులు పొంది 7 వేల 310 ఎకరాలకు సాగు నీరు అందించుటకు సంబంధించిన పనులు పురోగతిలో ఉన్నాయి మరియు 2 పంప్ లు ప్రారంభించడం జరిగినది మరియు త్వరత గతిన డిస్ట్రిబ్యూటరి కాలువల పనులు పూర్తి చేసి ఆయకట్టుకు సాగు నీరు ఇవ్వడం జరుగుతుంది.

**మత్స్య శాఖ:** జిల్లాలో మొత్తం 235 మత్స్య సహకార సంఘాలు ఏర్పాటు చేయడం జరిగింది. వీటిలో 17 వేల 100 మంది మత్స్యకారులకు సభ్యత్వం కలదు. 2026-27 సంవత్సరమునకు 1,256 చెరువులలో 2 కోట్ల 80 లక్షల చేప పిల్లలు వదులుటకు నిర్ణయించడమైనది. జిల్లాలో చేపల వేటకు వెళ్ళి ప్రమాదవశాత్తు మరణించిన 18 మంది మత్స్యకారుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం నుండి వారి నామినీలకు 90 లక్షల రూపాయల ఎక్స్-గ్రేషియా ఇవ్వడం జరిగినది.

**ఆరోగ్య శాఖ:** జిల్లా ప్రజల ఆరోగ్య సౌకర్యాల కొరకు జిల్లా కేంద్రము నందు ఒక వైద్య కళాశాలను మంజూరు చేసి మౌళిక సదుపాయాలను కల్పించడం జరిగినది. జాతీయ వైద్య మండలి అనుమతి పొంది ప్రతి సంవత్సరానికి 150 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పించబడుతుంది. జిల్లాలో ఆడ పిల్లల రోగనిరోధకత కొరకు HPV (హ్యూమన్ పాపిల్లోమా వైరస్ ) వ్యాక్సిన్ ను మార్చి 8, 2026 రోజున ప్రారంభించడం జరిగింది. దీని ముఖ్య ఉద్దేశ్యం ఆడ పిల్లలు గర్భాశయ క్యాన్సర్ బారిన పడకుండా 14 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఆడ పిల్లలకు హ్యూం వ్యాక్సిన్ ను అందచేయడం జరుగుతుంది. గర్భాశయ క్యాన్సర్ నివారణలో 93-1007. సామర్థ్యం తో HPV టీకాలు అత్యంత ప్రభావవంతమైనవి. దీని వల్ల ఎటువంటి దుష్ప్రభావాలు వుండవు. జిల్లాలో ఇప్పటి వరకు 4,734 మందికి ఈ హ్యూం వ్యాక్సిన్ ఇవ్వడం జరిగినది 88% వరకు చేరుకున్నాము. అనుమానిత జ్వర రోగుల నుండి రక్త నమూనాలను సేకరించి T- డయాగ్నొస్టిక్ హబ్ కు పంపించి రక్త పరీక్షలు చేయడం జరుగుతుంది. అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, హాస్టల్స్ మరియు ఆశ్రమ పాఠశాలలో సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుంది. జిల్లాలో 01-04-2026 నుండి ఇప్పటివరకు మాతా శిశు సంరక్షణ ద్వారా 4 వేల 765 గర్భిణీస్త్రీలను 12 వారాలలోపు నమోదు చేసి 4 వేల 32 మందికి రెండు టి.డి ఇంజక్షన్లు ఇవ్వడం జరిగింది. 3 వేల 557 మంది గర్భిణీ స్త్రీలకు 4 సార్లు పరీక్షలు నిర్వహించి, రక్తహీనత నివారణ కొరకు ఐరన్ ఫోలిక్ మాత్రలు ఇవ్వడం జరిగింది. జిల్లాలో 01-04-2026 నుండి ఇప్పటివరకు 3 వేల 605 కాన్పులు జరిగాయి. వీటిలో ప్రభుత్వ ఆసుపత్రులలో మొత్తం 2,426 కాన్పులు కాగా వీటిలో 1,315 సాధారణ కాన్పులు మరియు 1,111 శస్త్ర చికిత్స ద్వారా కాన్పులు జరిగాయి. సమగ్ర మహిళా ఆరోగ్య పథకం క్రింద అన్ని వయస్సుల మహిళలకు 8 రకాల స్క్రీనింగ్ వైద్య పరీక్షలు ప్రతి మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రులలో పూర్తి ఉచితంగా చేయబడుతున్నాయి. ఇప్పటివరకు జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో 11 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో స్క్రీనింగ్ వైద్య పరీక్షలు జరుగుతున్నాయి.

**పశుసంవర్ధక శాఖ :** జిల్లాలో మొత్తం 90 పశువైద్య కేంద్రాలు, 61 గోపాలమిత్ర కేంద్రాలు వివిధ స్థాయిల్లో పనిచేస్తూ పశుసంపదకు సేవలు అందిస్తూ ఉన్నాయి. వీటికి అదనంగా నాగర్ కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట్ మరియు కల్వకుర్తి నియోజకవర్గ కేంద్రాలలో సంచార పశువైద్యశాలలు ఏర్పాటు చేయటం జరిగింది. టోల్ ఫ్రీ నెంబర్ 1962 కు సమాచారం ఇచ్చినట్లైతే పశువులకు రైతుల ఇంటి వద్దనే వైద్యసేవలు ఉచితంగా అందించబడుతాయి. జిల్లాలో రోజువారి పాల ఉత్పత్తి 53 వేల 328 లీటర్లుగా వున్నది. జిల్లా యంత్రాంగం అనేక రకాల అవగాహన సదస్సులు, సబ్సిడిపై చొప్ప నరుకు యంత్రాలు, పశు గ్రాస విత్తనాల సరఫరా, వ్యాధి నిరోధక టీకాలు, పశు ఆరోగ్య శిభిరాలు నిర్వహించటం మరియు సబ్సిడీపై పాడి పశువులను సరఫరా చేయటము జరుగుచున్నది. గేదె పాలకు గరిష్టంగా 85 రూపాయలు మరియు ఆవు పాలకు గరిష్టంగా 42 రూపాయలు చెల్లించడం జరుగుతుంది.

**విద్యాశాఖ :** జిల్లాలో మొత్తం 753 ప్రభుత్వ పాఠశాలల్లో 48 వేల 798 మంది విద్యార్థులు నమోదు కాబడినారు. కే.జి.బి.వి. లలో 7 వేల 98 మంది విద్యార్థులు, ఆదర్శ పాఠశాలల్లో 810 మంది విద్యార్థులు మరియు URS పాఠశాలలో 104 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. జిల్లాలో 2025-26 విద్యా సంవత్సరం గాూజ పరీక్షలకు 10 వేల 641 మంది విద్యార్థులు హాజరు కాగా వారిలో 10 వేల 538 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 99.03% ఉత్తీర్ణత సాధించి రాష్ట్ర స్థాయిలో 2వ స్థానం లో నిలవడం జరిగింది. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా ఎంపికైన 751 పాఠశాలలో వివిధ రకాల అభివృద్ధి పనుల



కోసం 6 కోట్ల 27 లక్షల రూపాయలు కేటాయించడం జరిగింది. జిల్లా లోని వంగూరు మండలంలోని వంగూరు మరియు పోల్కంపల్లి గ్రామాలలో 30 కోట్ల రూపాయలతో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ నిర్మాణం చేపట్టడం జరుగుతుంది. ఈ విద్యా సంవత్సరం నుండి జిల్లాలో కల్వకుర్తి, నాగర్ కర్నూల్ మరియు కొల్లాపూర్ నియోజక వర్గాలలో కొత్తగా తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వము చర్యలు చేపట్టింది.జిల్లాలో ఈ విద్యా సంవత్సరం నుండి కల్వకుర్తి, నాగర్ కర్నూల్ మరియు కొల్లాపూర్ నియోజక వర్గాలలో కొత్తగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వము చర్యలు చేపట్టింది.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2025-26 విద్యా సంవత్సరంలో జిల్లాలో నూతనంగా 21 ప్రభుత్వ పాఠశాలల్లో మరియు 2026-27 విద్యా సంవత్సరంలో మరో 74 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ తరగతులను ప్రారంభించింది. ప్రీ-ప్రైమరీ తరగతులలోని విద్యార్థులకు బోధన, సంరక్షణ మరియు అభివృద్ధి సంబంధిత కార్యకలాపాలను నిర్వహించుటకు ప్రతి పాఠశాలకు ఒక ఇన్‌స్ట్రక్టర్‌ను మరియు ఒక ఆయాను నియమించడం జరిగింది. ప్రతి ప్రీ ప్రైమరీ పాఠశాలకు 1 లక్ష రూపాయలతో ఆధునీకరించి తరగతులను ప్రారంభించడం జరిగింది. జిల్లాలో ప్రీ-ప్రైమరీ పాఠశాలల యందు 1,981 విద్యార్థులు నమోదు కావడం జరిగింది. వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ద్వారా జిల్లాలో మొత్తం 20 ప్రీ మెట్రిక్ వసతి గృహములు, 8 పోస్ట్-మెట్రిక్ కళాశాల వసతి గృహములు నడపబడుచున్నవి. మహాత్మా జ్యోతిభా ఫూలే బి.సి. ఒవర్సీస్ విద్యా నిధి పథకం క్రింద విదేశాలకు వెళ్లి చదివే విద్యార్థులకు 20 లక్షల రూపాయల సహకారంతో బి.సి. సంక్షేమ శాఖా ద్వారా మంజూరు చేయడం జరిగుతుంది.అంబేడ్కర్ ఒవర్సీస్ విద్యా నిధి పథకం క్రింద విదేశాలకు వెళ్లి చదివే ఎస్.సి., ఎస్.టి విద్యార్థుల కొరకై 20 లక్షల రూపాయల సహకారంతో ఈ అంబేడ్కర్ ఒవర్సీస్ విద్యా నిధి పథకం ను ప్రవేశ పెట్టడం జరిగినది. షెడ్యుల్డు కులాల అభివృద్ధి శాఖ ద్వారా జిల్లాలో మొత్తం 29 ప్రీ మెట్రిక్ వసతి గృహములు, అందులో 24 బాలురు మరియు 5 బాలికల వసతి గృహములు, 6 పోస్ట్-మెట్రిక్ వసతి గృహములు అందులో 3 బాలురు మరియు 3 బాలికల కళాశాల వసతి గృహములు నడపబడుచున్నవి. గిరిజన సంక్షేమ శాఖ ద్వారా జిల్లాలో 9 ప్రీ-మెట్రిక్ హాస్టళ్లు, 15 ఆశ్రమ పాఠశాలలు 5 పోస్ట్-మెట్రిక్ కళాశాల హాస్టళ్లు నిర్వహించబడుతున్నాయి. మైనారిటీ సంక్షేమ శాఖ ద్వారా జిల్లాలో ప్రతి నియోజకవర్గనికి ఒకటి చొప్పున 4 పాఠశాలలు మరియు జూనియర్ కాలేజీలు 1,840 మంది విద్యార్థులతో నడపబడుతున్నవి.

**మాతా శిశు సంక్షేమ శాఖ :** అంగన్ వాడి కేంద్రముల ద్వారా అనుబంధ పోషకాహారం, పూర్వ ప్రాథమిక విద్య, రోగ నిరోధక సేవలు, ఆరోగ్య తనిఖీలు, రెఫరల్ సేవలు మరియు పోషకాహారం మరియు ఆరోగ్య విద్య వంటి సేవలు అందించ బడుచున్నవి. మన జిల్లాలో ఉన్న 1,132 అంగన్ వాడి కేంద్రాల ద్వారా 4 వేల 337 మంది గర్భవతులు, 2,785 మంది బాలింతలు, 24 వేల 795 మంది 0 నుండి 3 సంవత్సరాల పిల్లలు మరియు 14 వేల 174 మంది 3 సం. నుండి 6 సంవత్సరాలలోపు పిల్లలు ఆరోగ్యలక్ష్మి పథకం క్రింద లబ్ధి పొందుతున్నారు.

**జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార అభివృద్ధి శాఖ :** రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఎస్.సి. కార్యాచరణ ప్రణాళిక 2025-26 సబ్సిడీ రుణాలకు సంబంధించి ఆన్ లైన్ ద్వారా అప్లికేషన్లు ధరకాస్తు చేసుకునే అవకాశం కల్పించడం జరిగింది. మొత్తం 427 యూనిట్లకు గాను 352 యూనిట్లు బ్యాంకు రుణాల ద్వారా తీసుకునే పథకాలు మరియు 75 యూనిట్లు శిక్షణ విభాగం 100% సబ్సిడీ ద్వారా ఇవ్వడం జరుగును. మొత్తం 427 యూనిట్లకు 6 కోట్ల 13 లక్షల 94 వేల రూపాయలకు SC కార్పొరేషన్ ద్వారా 5 కోట్ల 92 లక్షల 44 వేల రూపాయలు మరియు PM-AJAY సబ్సిడీ ద్వారా 21 లక్షల 50 వేల రూపాయలు ఇవ్వడం జరిగింది.

# విశ్వకర్మ చేతివృత్తులకు ఆద్యుడు

# చేతివృత్తుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోంది

## రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి

**నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి సెప్టెంబర్ 17 :** భగవాన్ శ్రీ విరాట్ విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని గురువారం నాగర్‌కర్నూలు జిల్లా కలెక్టరేట్ ఆవరణలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకలకు రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భగవాన్ శ్రీ విరాట్ విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా సిరిసిల్ల రాజయ్య మాట్లాడుతూ......, భగవాన్ శ్రీ విరాట్ విశ్వకర్మ చేతివృత్తులకు ఆద్యుడని, చేతివృత్తులు, కళలు, నైపుణ్యాలకు విశ్వకర్మ ఆదర్శప్రాయుడని, సమాజ నిర్మాణంలో చేతివృత్తిదారుల పాత్ర ఎంతో కీలకమని హిందూ పురాణాలు, వేద సంప్రదాయాల్లో భగవాన్ విశ్వకర్మకు విశిష్ట స్థానం ఉందన్నారు. ఋగ్వేదం, కృష్ణ యజుర్వేదంలో విశ్వకర్మను సృష్టికర్తగా పరిగణించినట్లు తెలిపారు. సృష్టి నిర్మాణానికి ప్రతీకగా, శిల్పకళ, వాస్తుకళ, వివిధ చేతివృత్తులకు ఆద్యుడిగా విశ్వకర్మను ప్రజలు కొలుస్తారని,తరతరాలుగా తమ నైపుణ్యాలను, వృత్తి సంప్రదాయాలను కొనసాగిస్తూ సమాజానికి సేవలందిస్తున్న చేతివృత్తిదారులను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వారి నైపుణ్యాలను ఆధునిక సాంకేతికతతో అనుసంధానం చేసి ఆర్థికంగా మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. నాగర్‌కర్నూల్ శాసనసభ్యులు డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి మాట్లాడుతూ......, సమాజ నిర్మాణంలో విశ్వకర్మల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ప్రాచీన కాలం నుంచి తమ నైపుణ్యం, శ్రమ, సృజనాత్మకతతో



సమాజ అభివృద్ధికి విశ్వకర్మలు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని తెలిపారు. చేతివృత్తులపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా అండగా నిలవడంతో పాటు, వారికి అవసరమైన శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విశ్వకర్మ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రాచీన కాలం నుంచే విశ్వకర్మలు తమ అద్భుతమైన నైపుణ్యంతో కళలు, వృత్తులు, నిర్మాణ రంగాలకు విశిష్ట సేవలు అందించారని తెలిపారు. వారి నైపుణ్యం, కృషి, సేవలను భావితరాలకు తెలియజేసేందుకు ఇలాంటి వేడుకలు దోహదపడతాయని అన్నారు. యువత సంప్రదాయ వృత్తుల్లోని నైపుణ్యాలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో జోడించుకుని స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగాలని సూచించారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా చేతివృత్తిదారుల సంక్షేమం, వృత్తుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, అదనపు కలెక్టర్లు బి. చెన్నయ్య, దేవ సహాయం, నాగర్‌కర్నూల్ మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఇందిర, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలు, బీసీ ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పీఎం శ్రీ నిధులను సక్రమంగా వినియోగించాలి



## విద్యార్థులకు పూర్తి స్థాయిలో ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలి

**సమయం ప్రతినిధి మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 17:** పీఎం శ్రీ పాఠశాలలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అందుతున్న నిధులను నిబంధనల ప్రకారం సక్రమంగా, పారదర్శకంగా వినియోగించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ప్రధానోపాధ్యాయులకు సూచించారు. నిర్దేశించిన కార్యక్రమాలను సకాలంలో పూర్తి చేసి విద్యార్థులకు పూర్తిస్థాయిలో ప్రయోజనం చేకూరేలా చర్యలు చేపట్టాలన్నారు.గురువారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన పీఎం శ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పీఎం శ్రీ కార్యక్రమం ద్వారా పాఠశాలల అభివృద్ధికి వివిధ రూపాల్లో నిధులు అందుతున్నాయని, వాటిని నిబంధనల మేరకు వినియోగిస్తూ అవసరమైన మౌలిక వసతులు, విద్యా కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.అనంతరం నిర్వహించిన సమీక్షలో పాఠశాలల్లో అమలవుతున్న వివిధ కార్యక్రమాల పురోగతిని పరిశీలించారు. ప్రశస్తు సంబంధించిన అవగాహన వీడియోలను ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులందరూ వీక్షించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే స్వచ్ఛ విద్యాలయ రేటింగ్స్ వివరాలను యాప్‌లో నమోదు చేయాలన్నారు.ప్రతి విద్యార్థికి ఆధార్ అనుసంధానం పూర్తి చేయడంతో పాటు అపార్ గుర్తింపు సంఖ్యలు జారీ చేయాలని ఆదేశించారు. 'ఏక్ పేడ్ మాకే నామ్' కార్యక్రమంలో ప్రతి పాఠశాల నమోదు అయ్యేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. అదేవిధంగా 'దశముక్తి విద్యాలయ' కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని, ప్రతి పాఠశాలను మాదకద్రవ్య రహిత ప్రాంగణంగా ప్రకటించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయుల కు సూచించారు. పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల ప్రయోజనం, ప్రభుత్వ కార్యక్రమాల సమర్థవంతమైన అమలులో ప్రధానోపాధ్యాయుల పాత్ర కీలకమని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారులు, పీఎం శ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

**బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి. శ్రీనివాస్‌రెడ్డి**




సమయం ప్రతినిధి, మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 17: తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా గురువారం భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పి. శ్రీనివాస్‌రెడ్డి జాతీయ జెండాను ఎగురవేసి, తెలంగాణ విమోచన పోరాటంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పి. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. బ్రిటిష్ పాలన నుంచి భారతదేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం లభించినప్పటికీ, అప్పటి తెలంగాణ ప్రాంతం హైదరాబాద్ సంస్థానంలో భాగంగా నిజాం పాలనలో కొనసాగిందన్నారు. హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేయకుండా స్వతంత్ర రాజ్యంగా కొనసాగించాలని నిజాం ప్రయత్నించారని తెలిపారు.నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, భారత యూనియన్‌లో హైదరాబాద్ సంస్థానం విలీనం కావాలని కోరుతూ ఎందరో మహనీయులు ఉద్యమాలు, సాయుధ పోరాటాలు సాగించారని పేర్కొన్నారు. అప్పటి రజాకార్ల దాడులు, హింసాకాండలో అనేక మంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ పరిస్థితుల్లో అప్పటి కేంద్ర హోంశాఖ మంత్రి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నిర్ణయం మేరకు భారత ప్రభుత్వం 'ఆపరేషన్ పోలో' చేపట్టి, హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేసిందన్నారు. 1948 సెప్టెంబర్ 17 తెలంగాణ ప్రజలకు నిజమైన విమోచన లభించిన చారిత్రక దినమని పేర్కొన్నారు. తెలంగాణలో ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నప్పటికీ, సెప్టెంబర్ 17ను మాత్రం రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించడం లేదని శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కొందరి మెప్పు కోసం సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించకుండా గత ప్రభుత్వాలు వ్యవహరించాయని విమర్శించారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని సెప్టెంబర్ 17న ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని భారతీయ జనతా పార్టీ మొదటి నుంచి ఉద్యమాలు, పోరాటాలు చేస్తోందన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వస్తుందని, ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సెప్టెంబర్ 17ను 'తెలంగాణ విమోచన దినోత్సవం'గా అధికారికంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జి. పద్మజా రెడ్డి, అచ్చుగట్ల అంజయ్య, వీర బ్రహ్మాచారి, పడాకుల బాలరాజు, కృష్ణారెడ్డి, కార్పొరేటర్లు నాగిలిగారి రమేష్‌కుమార్, పాండురంగారెడ్డి, మర్రి జ్యోతి, నందిపేట రాజు, ధర్పల్లి హరికృష్ణ, జాజయం సుబ్రహ్మణ్యం, పోతుల రాజేందర్‌రెడ్డి, కే. రాములు, నాగేశ్వర్‌రెడ్డి, పద్మవేణి, వెంకటేశ్వరమ్మ, సాహితిరెడ్డి, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# కృత్రిమ కుంటల్లో వినాయక విగ్రహాల నిమజ్జనం

## ప్రజలు సమీపంలోని కృత్రిమ కుంటలను వినియోగించుకోవాలి జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా



**సమయం ప్రతినిధి, మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 17:** వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం ప్రజలు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదని, సమీపంలో ఏర్పాటు చేసిన కృత్రిమ కుంటలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సూచించారు. చిన్న, మధ్య తరహా విగ్రహాలను ఆయా కుంటల్లోనే నిమజ్జనం చేయాలని కోరారు.వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలోని పలు ప్రాంతాల్లో చెరువులు, కుంటలు ఎండిపోవడంతో మహబూబ్‌నగర్‌తో పాటు జడ్చర్ల, దేవరకద్ర, భూత్పూర్ మున్సిపాలిటీల పరిధిలో కృత్రిమ కుంటలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. నిమజ్జనానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.మహబూబ్‌నగర్‌లో అప్పన్నపల్లి సమీపంలోని మయూరి పార్క్ ఎదురుగా గంగోస్కుంట వద్ద రెండు కృత్రిమ కుంటలు, పంచవటి పాఠశాల సమీపంలోని పార్కు వద్ద కుంటలను ఏర్పాటు చేశారు. ఐదు అడుగులకు పైగా ఉన్న పెద్ద విగ్రహాలను బైపాస్ రోడ్డు వద్దకు తీసుకురావాలని, అక్కడి నుంచి ప్రభుత్వ వాహనాల్లో బీచుపల్లికి తరలించి నిమజ్జనం చేయనున్నట్లు అధికారులు తెలిపారు. చిన్నదర్పల్లి చెరువులోనూ నిమజ్జనానికి ఏర్పాట్లు చేశారు.దేవరకద్రలో స్టేషన్ రోడ్డులోని చర్చి సమీపంలో, జడ్చర్లలో మున్సిపల్ కార్యాలయం వద్ద, మూడో వార్డు పార్కు, 8వ వార్డు హౌసింగ్ బోర్డు కాలనీ పార్కులో, భూత్పూర్‌లోని రాందాస్ తండాలో కృత్రిమ కుంటలను ఏర్పాటు చేశారు. ప్రజలు జిల్లా యంత్రాంగం సూచించిన నిబంధనలు పాటిస్తూ సమీపంలోని కృత్రిమ కుంటలను వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు. కృత్రిమ కుంటల్లో నిమజ్జనం చేయడం ద్వారా నీటి కాలుష్యాన్ని నివారించి పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని తెలిపారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వేగం పెంచాలి, అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

**మహబూబాబాద్ జిల్లా (సెప్టెంబర్ 17 వేకువ సమయం ప్రతినిధి) :** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వేగం పెంచాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని, ఉద్యోగులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ హెల్మెట్ ధరించాలన్నారు, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె. అనిల్ కుమార్, ఇన్చార్జి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు, హౌసింగ్ పీడీ పురుషోత్తం, లతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, రెండు పడకల గదుల నిర్మాణం పై సమీక్ష సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల పనులలో వేగం పెంచాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి పూరి గుడిసె ఉన్న వారి వివరాలు సేకరించి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్, అసిస్టెంట్ ఇంజనీర్స్, క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు అవగాహన కల్పించి, నిర్మాణం పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, వివిధ దశలలో నిర్మాణం పూర్తి చేసుకున్న ఇండ్లకు బిల్లులు మంజూరు చేయాలని, రెండు పడకల గదుల నిర్మాణం లో కూడా వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు భద్రత చర్యల్లో భాగంగా ఉద్యోగులు సైతం బాధ్యతయుతంగా ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని, తెలిపారు, హౌసింగ్ అసిస్టెంట్ ఇంజనీర్స్, సిబ్బంది, క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా 2 వీలర్స్ పై వెళుతున్న క్రమంలో ఎలాంటి రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తగా ప్రయాణం చేయాలని,




కోరారు హౌసింగ్ ఉద్యోగులకు (22) మందికి హెల్మెట్లను పంపిణీ చేశారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా రోడ్డు భద్రత పై అనేక కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని ప్రతి ఒక్కరూ కచ్చితంగా ట్రాఫిక్ రూల్స్ పాటించి మీరు మీ కుటుంబాన్ని సంరక్షించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ అబ్దుల్ హకీమ్, రాజన్న, అసిస్టెంట్ ఇంజనీర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

# చిత్తడి నెలలు (వెట్ ల్యాండ్) పరిరక్షణ, నిర్వహణకు పకడ్బందీ చర్యలు

**జిల్లా స్థాయి కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించిన : జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్**



మహబూబాబాద్ జిల్లా (సెప్టెంబర్ 17 వేకువ సమయం ప్రతినిధి) : జిల్లాలోని చిత్తడి నేలలు (వెట్‌ల్యాండ్స్), చెరువులు, ఇతర జలాశయాల పరిరక్షణ, సమర్థవంతమైన నిర్వహణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ చర్యలు చేపట్టాలని, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో నిర్వహించిన 'జిల్లా స్థాయి చిత్తడి నేలల పరిరక్షణ కమిటీ' సమీక్ష సమావేశంలో సంబంధిత అధికారులతో కలెక్టర్ సమగ్రంగా చర్చించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ...పరిరక్షణ, సర్వే: జిల్లా పరిధిలోని గుర్తించిన చిత్తడి నేలల సరిహద్దులను వెంటనే స్పష్టంగా సర్వే చేసి, ఆక్రమణలకు గురికాకుండా కంచెలు (ఫెన్సింగ్) మరియు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలి.జీవవైవిధ్యం కాపాడటం: పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో, భూగర్భ జలాలు పెరగడంలో పక్షులు/జీవుల ఉనికికి చిత్తడి నేలలు ఎంతో కీలకమైనవని, వాటి ప్రాముఖ్యతను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అవగాహన కార్యక్రమాలు: చిత్తడి నేలల ప్రాముఖ్యతపై స్థానిక ప్రజలు, విద్యార్థులకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని రెవెన్యూ, అటవీ, నీటిపారుదల మరియు పర్యావరణ శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు.శాఖల సమన్వయం: ప్రతి శాఖ తమ పరిధిలోని సమాచారాన్ని క్రమం తప్పకుండా జిల్లా కమిటీకి అందించాలని, సంయుక్త తనిఖీలు చేపట్టాలని సూచించారు. ఈ వెట్ ల్యాండ్ పరిరక్షణ నిర్వహణకు జిల్లా స్థాయి కమిటీ చైర్మెన్ గా జిల్లా కలెక్టర్, జిల్లా అటవీ శాఖ అధికారి మెంబర్,కన్వీనర్, అదనపు కలెక్టర్ రెవెన్యూ, జడ్పీ సీఈవో, డిఆర్డిఓ, ముఖ్య ప్రణాళిక అధికారి, జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా మాత్య శాఖ అధికారి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, జిల్లా ఉద్యాన అధికారి, ఎస్ఈ ఇరిగేషన్, ఈఈ కాలుష్య నియంత్రణ అధికారి, ఏడి ల్యాండ్ రికార్డ్స్ అధికారి, డిడి గ్రౌండ్ వాటర్, జిల్లాలోనీ (5) మున్సిపల్ కమిషనర్లు, సభ్యులు గా మొత్తం (19) మంది పనిచేస్తున్నారని, జిల్లాలోని ఆకేరు, తదితర ట్యాంక్లు, చెరువులు,కుంటలు , కెనాల్స్, లతో పాటు వెట్ ల్యాండ్ పరిరక్షణ పరిధిలోకి వచ్చే సుమారు (493) ట్యాంక్స్ ను పరిరక్షించి పర్యావరణం కలుషితం కాకుండా అన్ని శాఖలు సమన్వయంతో కలిసి పనిచేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్, ఐబి ఎస్ఈ రామకృష్ణ, ఈఈ రవి కుమార్, ఎఫ్డిఓ వెంకటేశ్వర్లు, ఎడి సర్వే ల్యాండ్ శ్రీనివాసులు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నితీష్, అన్ని విభాగాల సంబంధిత అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు దామోదర్, తదితరులు పాల్గొన్నారు.

## వనపర్తి పాలిటెక్నికల్ కళాశానందు ఏర్పాటు చేసిన గణపతికి భక్తిశ్రద్ధలతో పూజలు

వనపర్తి. సమయం ప్రతినిధి : వనపర్తి పట్టణ కేంద్రంలోని పాలిటెక్నికల్ కళాశాల ముందు ఏర్పాటుచేసిన గణపతి కీ ప్రతిరోజు ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ వచ్చినా భక్తులందరికీ ప్రసాద వితరణ ప్రత్యేక దర్శనం కల్పించిన కార్యనిర్వాహకుల బృందం కాంగ్రెస్ పార్టీ మాజీ పట్టణ అధ్యక్షులు చీర్ల చందర్ మాట్లాడుతూ వనపర్తి పట్టణ ప్రజలందరూ తప్పకుండా గణపతి మండపానికి విచ్చేసి భక్తిశ్రద్ధలతో దర్శనం చేసుకొని అన్నప్రసాద వితరణను స్వీకరించాలని కోరారు వనపర్తి పట్టణంలో ఏర్పాటు చేసిన గణపతి మండపాలలో ఈ మండపం ప్రత్యేక స్థానాన్ని దక్కించుకొని భక్తులందరినీ ఆకర్షితులను చేస్తుంది ఈ కార్యక్రమానికి వెళ్లి గణపతి దర్శనం చేసుకున్న ఉమ్మడి జిల్లా రిపోర్టర్ కానమోని ఆంజనేయులుకు శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.

OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085